



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 11 సంచిక : 227 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం బుధవారం 23 ఏప్రిల్ 2025 వెల : 5/-రూ॥

VOLUME :11 ISSUE : 227 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM WED 23 APRIL 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Visakhapatnam, Kakinada, Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Prakasam,Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur

## ఏపీని దోచుకుంటున్నారు...
## ప్రభుత్వ పెద్దల జేబులు నిండుతున్నాయి

- వైసీపీ పీఏసీ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వంపై జగన్ తీవ్ర విమర్శలు
- కక్ష సాధింపు రాజకీయాలు, అవినీతి పెరిగిపోయాయని ఆరోపణ
- విశాఖ భూములు, అమరావతి పనులపై ప్రభుత్వ నిర్ణయాలను తప్పుబట్టిన మాజీ సీఎం



**పెన్ పవర్ డెస్క్:**కూటమి ప్రభుత్వంపై వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన వైసీపీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో కక్ష సాధింపు రాజకీయాలు పెరిగిపోయాయని, వ్యవస్థలను దిగజార్చుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వ నిర్ణయాలలో పారదర్శకత లోపించిందని జగన్ విమర్శించారు. విశాఖపట్నంలో సుమారు రూ. 3 వేల కోట్ల విలువైన భూమిని ఎలాంటి గుర్తింపు లేని సంస్థకు కేవలం ఒక్క రూపాయికే కట్టబెట్టారని ఆయన ఆరోపించారు. అదేవిధంగా, లులూ గ్రూపునకు రూ.2,000 కోట్ల విలువైన భూమిని అప్పగించారని మండిపడ్డారు. రాజధాని అమరావతిలో నిర్మాణ పనుల అంచనాలను భారీగా పెంచి, ప్రజాధనాన్ని దోచుకుంటున్నారని అన్నారు. గతంలో రూ. 36 వేల కోట్లుగా ఉన్న పనుల అంచనాలను, సిమెంట్, స్టీల్ ధరలు పెరిగాయనే సాకుతో ఇప్పుడు రూ. 77 వేల కోట్లకు పెంచారని జగన్ ఆరోపించారు. జ్యుడీషియల్ ప్రివ్యూ, రివర్స్ టెండరింగ్ వంటి పారదర్శక విధానాలను తొలగించి, మొబిలైజేషన్ అడ్వాన్సులను తిరిగి తీసుకురావడం ద్వారా దోపిడీకి ఆస్కారం కల్పిస్తున్నారని ఆయన విమర్శించారు. రాష్ట్రంలో భయానక వాతావరణం సృష్టిస్తున్నారని, తమ ప్రభుత్వ హయాంలో పనిచేసిన అధికారులను లక్ష్యంగా చేసుకుంటున్నారని జగన్ విమర్శించారు. సీనియర్ ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులు అరెస్టును ఆయన ఖండించారు. ఇది కక్ష సాధింపు రాజకీయాలకు పరాకాష్ఠ అని అన్నారు. ఎంపీ మిథున్ రెడ్డిని, పెద్దిరెడ్డి కుటుంబాన్ని కూడా లక్ష్యంగా చేసుకుని, లేనిపోని ఆరోపణలతో ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. కీలక సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఇలాంటి అరెస్టులు, ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. తమ ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన మద్యం విధానం విప్లవాత్మకమైనదని అన్నారు. గత ప్రభుత్వం అమలు చేసిన అనేక సంక్షేమ పథకాలను ప్రస్తుత ప్రభుత్వం రద్దు చేసిందని దుయ్యబట్టారు. సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీల అమలు ఏమైందని ప్రశ్నించారు. ఆరోగ్యశ్రీని పూర్తిగా పక్కనపెట్టారని,

వివరాలు 2లో..

## ఢిల్లీలో బిజీబిజీగా చంద్రబాబు...
## కేంద్ర జలశక్తి మంత్రితో భేటీ

- పోలవరం నిధులు, బనకచర్ల అనుమతులపై చర్చ
- ఏపీ ప్రాజెక్టులకు కేంద్ర సాయం కోరిన చంద్రబాబు
- జలశక్తి మంత్రికి పోలవరం, బనకచర్లపై సీఎం వినతి



**పెన్ పవర్ డెస్క్:**విదేశీ పర్యటనను ముగించుకున్న ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీ పర్యటనలో బిజీగా ఉన్నారు. తన ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో కాసేపటి క్రితం సమావేశమయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన కీలక నీటిపారుదల ప్రాజెక్టులకు కేంద్ర సహకారం అందించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు వెంట కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, టీడీపీ ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కృష్ణ ప్రసాద్, అప్పలనాయుడు, హరీష్ బాలయోగి, సానా సతీష్ తదితరులు ఉన్నారు. సమావేశంలో ప్రధానంగా పోలవరం ప్రాజెక్టుకు అవసరమైన నిధుల విడుదల, పనుల పురోగతిపై చర్చించినట్లు సమాచారం. 2027 నాటికి పోలవరం ప్రాజెక్టు తొలి దశను పూర్తి చేయాలనే లక్ష్యంతో ఉన్నామని, ఇందుకు కేంద్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందించాలని సీఎం చంద్రబాబు కేంద్ర మంత్రిని కోరారు. అనంతరం, పోలవరం ప్రాజెక్టును క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు రావాల్సిందిగా కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌ను ముఖ్యమంత్రి ఆహ్వానించారు. అలాగే, రాయలసీమ ప్రాంతానికి సాగు, తాగునీరు అందించడంలో కీలకమైన

వివరాలు 2లో..

## అరెస్టులు పారదర్శకంగానే జరుగుతున్నాయి

- ఏపీలో జరుగుతున్న అరెస్టులపై హోం మంత్రి అనిత ఏం చెప్పారంటే..!
- వైసీపీ హయాంలో హింస పరాకాష్ఠకు చేరిందని మండిపాటు
- విచారణకు అందరూ సహకరించాలని హితవు

వివరాలు 2లో..



## పీఎస్ఆర్ ఆంజనేయులు అరెస్ట్‌పై రోజా ఫైర్

- మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ పీఎస్ఆర్ ఆంజనేయులును అరెస్ట్ చేసిన ఏపీ పోలీసులు
- డర్టీ డైవర్షన్ పాలిటిక్స్ అంటూ రోజా విమర్శలు
- ఇలాంటి వాటికి ఎవరూ భయపడరంటూ వ్యాఖ్యలు



**పెన్ పవర్ డెస్క్:**మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ పీఎస్ఆర్ ఆంజనే యులు అరెస్ట్‌పై మాజీ మంత్రి, వైసీపీ ఎమ్మెల్యే ఆర్కే రోజా తీవ్రస్థాయిలో స్పందించారు. ఇది పూర్తిగా కూటమి ప్రభుత్వ డైవర్షన్ పాలిటిక్స్ అని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైన తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే ఇలాంటి అరెస్టులకు పాల్పడుతున్నారని ఆమె మండిపడ్డారు. తాడేపల్లిలోని

వివరాలు 2లో..

## యా హబీబీ, యా హబీబీ....

ప్రధాని మోదీ సౌదీ పర్యటనపై ఒవైసీ వ్యంగ్యం

- సౌదీ పర్యటనకు వెళ్లిన మోదీ
- వక్ఫ్ చట్టం గురించి మాట్లాడుతూ మోదీ పర్యటన గురించి ప్రస్తావించిన ఒవైసీ
- ముస్లిం దేశాల్లో వక్ఫ్ లేదంటూ బీజేపీ చేస్తున్న ప్రచారం అవాస్తవమంటూ వెల్లడి

వివరాలు 2లో..



## జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్ర దాడి

- కాల్పుల ఘటనలో ఒకరి మృతి, ఆరుగురు పర్యాటకులకు గాయాలు
- పహల్గాంలోని బైసరన్ వ్యాలీ ఎగువ ప్రాంతంలో ఘటన
- ఘటనాస్థలానికి చేరుకున్న భద్రతా బలగాలు, వైద్య సిబ్బంది




వివరాలు 2లో..

## విజయసాయిరెడ్డిపై అంబటి రాంబాబు తీవ్ర విమర్శలు

- తమ పార్టీ నుంచి వెళ్లిపోయి తమపైనే విమర్శలు చేస్తున్నారంటూ విజయసాయిపై అంబటి ఫైర్
- పీఎస్ఆర్ ఆంజనేయులు, కసిరెడ్డిల అరెస్టులు కక్ష సాధింపేనని విమర్శ
- టీడీపీ ప్రభుత్వం మూల్యం చెల్లించుకుంటుందని హెచ్చరిక



**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని, ప్రభుత్వ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే అరెస్టుల పర్వానికి తెరలేపిందని వైసీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు మండి పడ్డారు. తమ పార్టీ నుంచి వెళ్లిపోయి తమపైనే విమర్శ లు చేస్తున్న విజయసాయిరెడ్డి వంటి వారిని చూసి భయపడేది లేదని, ఆయన

వివరాలు 2లో..

## పోలవరం నిర్వాసితులకు అంత్యోదయ కార్డులు అందజేసిన మంత్రి నాదెండ్ల



- పోలవరం ఆర్ అండ్ ఆర్ కాలనీలో మంత్రి నాదెండ్ల పర్యటన
- నిర్వాసితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా
- నిర్వాసితుల త్యాగాలను కూటమి ప్రభుత్వం మర్చిపోదని స్పష్టీకరణ

వివరాలు 2లో..

## దాడి వెనుక ఉన్న వారిని వదిలి పెట్టేది లేదు

- జమ్ము కశ్మీర్ ఉగ్ర దాడిపై ప్రధాని మోదీ, జమ్ము కశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా స్పందన
- ఉగ్రవాదంపై పోరాడాలనే తమ సంకల్పం అచంచలమైనదన్న మోదీ
- దాడికి పాల్పడిన వారు మానవ మృగాలు అన్న ఒమర్ అబ్దుల్లా

వివరాలు 2లో..



**పెన్ పవర్ డెస్క్:**జమ్ము కశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లా పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, జమ్ము కశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా స్పందించారు.

## పార్లమెంటే సుప్రీం

### మరోసారి సంచలన వ్యాఖ్యలు చేసిన ఉప రాష్ట్రపతి

- బిల్లుల ఆమోద విషయంలో రాష్ట్రపతికి కూడా గడువు విధించాలన్న సుప్రీంకోర్టు
- వక్ఫ్ బోర్డు బిల్లుపై కూడా కీలక వ్యాఖ్యలు
- రాజ్యాంగపరమైన విషయాల్లో ప్రజాప్రతినిధులదే అంతిమ నిర్ణయమన్న ఉప రాష్ట్రపతి



వివరాలు 2లో..

## జగన్ చూసి రమ్మంటే ఇతడు కాల్చి వచ్చేవాడు

### పీఎస్సార్ అరెస్ట్ పై రఘురామకృష్ణరాజు స్పందన



- ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ పీఎస్సార్ ఆంజనేయులు అరెస్ట్
- పీఎస్సార్ చాలా అనైతిక పనులకు పాల్పడ్డారన్న రఘురామ
- తనపై దాడి కేసులోనూ పీఎస్సార్ కీలక పాత్ర పోషించాడని ఆరోపణ

వివరాలు 2లో..

**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్‌లో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సంచలనం సృష్టించిన ముంబై నటి కాదంబరి జెత్వానీ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. అప్పటి ఇంటెలిజెన్స్ చీఫ్‌గా పనిచేసిన సీనియర్ ఐపీఎస్ అధికారి పీఎస్సార్ ఆంజనేయులును ఏపీ పోలీసులు

## ప్రధాని మోదీకి ఫైటర్ జెట్లతో సౌదీ అరేబియా అపూర్వ స్వాగతం..

- సౌదీ అరేబియా పర్యటనకు వెళ్లిన ప్రధాని నరేంద్ర మోదీ
- సౌదీ గగనతలంలోకి ప్రవేశించగానే ఫైటర్ జెట్లతో స్వాగతం
- రాయల్ సౌదీ ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన ఎఫ్-15 విమానాల ఎస్కార్ట్
- రెండు రోజుల పర్యటనలో ద్వైపాక్షిక సహకారమే ప్రధాన అజెండా



**పెన్ పవర్ డెస్క్:**భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మంగళవారం నాడు సౌదీ అరేబియా పర్యటనకు వెళ్లారు. ఈ సందర్భంగా సౌదీ అరేబియా ప్రభుత్వం ఆయనకు అపూర్వ రీతిలో స్వాగతం పలికింది. ప్రధాని మోదీ ప్రయాణిస్తున్న విమానం సౌదీ అరేబియా గగనతలంలోకి ప్రవేశించగానే, రాయల్ సౌదీ ఎయిర్‌ఫోర్స్‌కు

వివరాలు 2లో..

# ఏపీని దోచుకుంటున్నారు...
# ప్రభుత్వ పెద్దల జేబులు నిండుతున్నాయి

- మొదటి పేజీ తరువాయి
రూ. 3500 కోట్ల బకాయిలు పేరుకుపోయాయని అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన పథకాల కింద గత ఏడాది రూ. 3,900 కోట్లు బకాయి పెట్టారని, ఈ ఏడాది కూడా చెల్లింపులు జరగడం లేదని తెలిపారు. పెన్షన్ల సంఖ్యను తగ్గించారని, కొత్తగా ఒక్క పెన్షన్ కూడా ఇవ్వలేదని ఆరోపించారు.
తాము గతంలో సంక్షేమ పథకాలకు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి డబ్బు జమ చేయడానికి బటన్ నొక్కామని, ఇప్పుడెందుకు అలా చేయడం లేదని జగన్ ప్రశ్నించారు. బటన్ నొక్కితే డబ్బులు నేరుగా ప్రజల ఖాతాల్లోకి వెళతాయని, మధ్యలో దోచుకోవడానికి ఏమీ ఉండదనే ఉద్దేశంతోనే చంద్రబాబు బటన్ నొక్కడం లేదని ఆయన ఎద్దేవా చేశారు. రాష్ట్ర ఆదాయం తగ్గిపోతుండగా, ప్రభుత్వ పెద్దల జేబులు నిండుతున్నాయని ఆరోపించారు.
ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో పీఏసీ సభ్యులు క్రియాశీలక పాత్ర పోషించాలని జగన్ పిలుపునిచ్చారు. క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమై, ప్రభుత్వ వైఫల్యాలను, అన్యాయాలను ఎప్పటికప్పుడు ప్రజల దృష్టికి తీసుకురావాలని సూచించారు. వైసీపీకి మీడియా బలం తక్కువగా ఉన్నందున... సోషల్ మీడియాను, ముఖ్యంగా స్మార్ట్‌ఫోన్‌ను ఒక ఆయుధంగా వాడుకోవాలనే విషయంపై కార్యకర్తలకు అవగాహన కల్పించాలన్నారు.
గతంలో కాంగ్రెస్‌ను వీడినప్పుడు కూడా ఇలాంటి దుష్ప్రచారాలు ఎదుర్కొన్నామని, అయినా ప్రజలు ఆశీర్వదించారని గుర్తుచేశారు. ఎన్ని కేసులు పెట్టినా, జైల్లో పెట్టినా ప్రజా వ్యతిరేకతను అణచివేయలేరని, ప్రజల అంతిమ తీర్పును ఎవరూ మార్చలేరని ధీమా వ్యక్తం చేశారు. కష్టకాలంలోనే నాయకులు ఎదుగుతారని, ప్రజల పక్షాన రాజీలేని పోరాటం చేయాలని పార్టీ శ్రేణులకు జగన్ దిశానిర్దేశం చేశారు.

# ఎడిటర్ వ్యూ

## పునరుత్పాదక శక్తి తో భద్రంగా ధరిత్రి

ఏప్రిల్ 22, 2025న 55వ ఎర్త్ డే ను జరుపుకుంటూ ఉన్నారు. ప్రపంచవ్యాప్తంగా 192 దేశాలు, ఒక బిలియన్ కంటే ఎక్కువ మంది ప్రజలు ఈ కార్యక్రమంలో భాగమయ్యారు. అన్ని వర్గాల ప్రజలు మెరుగైన భవిష్యత్తు కోసం కలిసి పనిచేయడానికి ఈ రోజు నిర్వహించే అవగాహన కార్యక్రమాలు ఒక నాంది మాత్రమే. 2025 ఎర్త్ డే థీమ్ 'అవర్ పవర్, అవర్ ప్లానెట్' . క్లీన్ ఎనర్జీ ద్వారా 2030 నాటికి మూడు రెట్లు పునరుత్పాదక శక్తి పెంచడం కోసం అందరూ పాటు పడాలి. పునరుత్పాదక శక్తి వైపు అడుగులు వేసి, స్థిరమైన భవిష్యత్తును నిర్మించడంలో వ్యక్తులు, సంస్థలు, ప్రభుత్వాల సమిష్టి బాధ్యత గురించి తెలియజేస్తుంది. ఈ సంవత్సరం ఎర్త్ డే థీమ్ లో భాగంగా ప్రధాన దృష్టి పునరుత్పాదక శక్తి గురించే. శిలాజ ఇంధనాల ఉపయోగాన్ని ఆపేసేలా చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. సౌర, పవన, జల, భూఉష్ణ, టైడల్ విద్యుత్ వంటి క్లీన్, స్థిరమైన ఇంధన వనరుల వైపు మారవలసిన తక్షణ అవసరాన్ని ఈ థీమ్ నొక్కి చెబుతుంది. 2030 నాటికి ప్రపంచవ్యాప్తంగా శుభ్రమైన విద్యుత్ ఉత్పత్తిని మూడు రెట్లు పెంచడం ప్రాథమిక లక్ష్యం. పునరుత్పాదక శక్తికి మారడం చాలా అవసరం.
వాతావరణ మార్పులను ఎదుర్కోవడం:
శిలాజ ఇంధనాలు గ్రీన్‌హౌస్ వాయు రెసిడ్యూ లకు ప్రధాన కారణం, ఇది గ్లోబల్ వార్మింగ్, దాని పరిణామాలకు కారణమవుతుంది. పునరుత్పాదక శక్తి హానికరమైన ఉద్గారాలను గణనీయంగా తగ్గించడానికి ఒక మార్గాన్ని అందిస్తుంది, ఇది వాతావరణ మార్పులను తగ్గించడంలో సహాయపడుతుంది. వాయు కాలుష్యాన్ని తగ్గించడం: శిలాజ ఇంధనాలను కాల్చడం వల్ల శ్వాసకోశ వ్యాధులు, ఇతర ఆరోగ్య సమస్యలు కలిగించే హానికరమైన కాలుష్య కారకాలు విడుదలవుతాయి, స్వచ్ఛమైన శక్తిని వినియోగించడం ద్వారా గాలి నాణ్యతను మెరుగుపరచవచ్చు. ఇంధన భద్రతను పెంచడం: శిలాజ ఇంధన వనరులపై ఆధారపడటం పలు విషయాలకు సంబంధించి అస్థిరతకు దారితీస్తుంది. పునరుత్పాదక ఇంధన వనరులు తరచుగా మరింత వికేంద్రీకృతమై స్థానికంగా అందుబాటులో ఉంటాయి. ఆర్థిక వృద్ధిని పెంచడం: పునరుత్పాదక ఇంధన రంగం వేగంగా అభివృద్ధి చెందుతున్న పరిశ్రమ, ఎన్నో ఉద్యోగాలను సృష్టించగలదు. ఆవిష్కరణ, ఆర్థిక అభివృద్ధికి ఎన్నో అవకాశాలను సృష్టిస్తుంది. ప్రజారోగ్యాన్ని మెరుగుపరచడం: కాలుష్య సంబంధిత వ్యాధులను తగ్గించడం ద్వారా ప్రజల ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది పునరుత్పాదక ఇంధన వనరులు: మన చుట్టూ సమృద్ధిగా లభించే ఎండ, గాలి, నీరు సరిగా ఉపయోగించుకోవాలి పునరుత్పాదక ఇంధన వనరులకు మారడం గ్రీన్‌హౌస్ వాయు రెసిడ్యూ లను తగ్గించడానికి చాలా కీలకమైనవి. ఎందుకంటే పునరుత్పాదక ఇంధనాలు ప్రాథమిక గ్రీన్‌హౌస్ వాయువు అయిన కార్బన్ డయాక్సైడ్‌ను ఉత్పత్తి చేయకుండా కావాల్సిన విద్యుత్తును ఉత్పత్తి చేస్తాయి. శిలాజ ఇంధనాలు గ్రీన్‌హౌస్ వాయువుల ప్రధాన ఉద్గారాలకు కారణమవుతాయి. అందువల్ల గ్లోబల్ వార్మింగ్‌కు దోహదపడతాయి. ఈ ఉద్యమాలు, కార్యక్రమాలలో భాగమవ్వడం ప్రతి ఒక్కరి బాధ్యత. ప్రభుత్వాలు, కార్పొరేషన్లు నిబద్ధతతో ముందుకు వెళ్ళాలి. నిర్ణయాత్మక చర్యలు తీసుకోవాలి. పునరుత్పాదక శక్తిని దృష్టిలో ఉంచుకుని ముందుకు కదలాలి, రోజువారీ జీవితంలో స్థిరమైన ఎంపికలు ప్రతి ఒక్కరికీ ఉండాలి. మనం మన స్వరాన్ని సగర్వంగా వినిపించాలి, గొప్ప కార్యాచరణ కోసం ప్రతి ఒక్కరూ ఏకమవ్వాలి. భవిష్యత్తు తరాలకు మంచి భవిష్యత్తును ఇవ్వగలమని ఈ విప్లవం నిరూపిస్తుంది.
ఈ 2025 ఎర్త్ డే సందర్భంగా, మనందరికీ ఆరోగ్యకరమైన, స్థిరమైన, సమానమైన, సుసంపన్నమైన భవిష్యత్తును నిర్మించడానికి పునరుత్పాదక శక్తిని ఉపయోగించుకోవడానికి కట్టుబడి ఉందామని నిర్ణయం తీసుకుందాం. సౌర, పవన, జల విద్యుత్, టైడల్ లేదా జియోథర్మల్ లాంటి పునరుత్పాదక ఇంధన వనరులకు మద్దతు ఇవ్వండి, మార్పును స్వీకరించండి. ప్రభుత్వాల నుండి, ప్రపంచ పరిశ్రమ, స్థానిక వ్యాపారాల వరకు, యూనియన్ల నుండి, పాఠశాలల నుండి, మత నాయకుల నుండి, పౌర సమాజం, కుటుంబాలు, వ్యక్తుల వరకూ.. మీరు పట్టణ మేయర్ అయినా, ట్రేడ్ యూనియన్ అధినేత అయినా, %జజూూ% అయినా, బ్యాంకర్ అయినా, కళాకారుడైనా, రైతు అయినా, మత్స్యకారుడైనా, ఉపాధ్యాయుడైనా లేదా అగ్నిమాపక సిబ్బంది అయినా.. ఈ విప్లవం నిజమైన శక్తి మీలాంటి వ్యక్తుల చేతుల్లోనే ఉంది. ఈ పరివర్తన వెనుక ఉన్న అసలు సిసలైన శక్తి ప్రజాశక్తి. భవిష్యత్తును మారుద్దాం.. ఈ భూమిని బతికించుకుందాం!!

## అరెస్టులు పారదర్శకంగానే జరుగుతున్నాయి

పెన్ పవర్ డెస్క్:మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్, ఐపీ ఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులు అరె స్ట్‌పై రాష్ట్ర హెూం శాఖ మంత్రి వంగలపూడి అనిత స్పందించారు. గత ప్రభుత్వ హ యాంలో కొందరు అధికారులు అప్పటి రాజకీ య నాయకులను, ముఖ్యమంత్రిని మెప్పిం చడం కోసం నిబంధనలకు విరుద్ధంగా పనిచేసి ఇప్పుడు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆమె వ్యాఖ్యానించారు. కాదంబరి జెత్వానీ అనే మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జరిగిన విచారణలో లభించిన ఆధారాలతోనే చట్ట ప్రకారం ఆంజనేయులును అరెస్ట్ చేశారని, ఇందులో ఎలాంటి కక్ష సాధింపు లేదని ఆమె స్పష్టం చేశారు. గతంలో ఐఏఎస్ అధికారిణి శ్రీలక్ష్మి ఎదుర్కొన్న ఇబ్బందులను ప్రస్తావిస్తూ, తమ ప్రభుత్వంలో ఏ అధికారికి అలాంటి పరిస్థితి రాలేదని మంత్రి అన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తాము ఎన్నో కేసులు, ఇబ్బందులు ఎదుర్కొన్నామని, కానీ ఏ అధికారిపైనా కక్ష సాధించలేదని తెలిపారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో అధికారులు ఎందుకు చట్టం ముందు దోషులుగా నిలబడాల్సి వస్తుందో ఆ పార్టీ ఆత్మపరిశీలన చేసుకోవాలని హితవు పలికారు. తప్పులు చేయించి, ఇప్పుడు అధికారులు ఇబ్బందుల్లో ఉంటే కనీసం పక్కన నిలబడకుండా వారి వ్యక్తిత్వం గురించి మాట్లాడటం సరికాదని విమర్శించారు. వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి కక్ష సాధింపుల గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని మంత్రి అనిత అన్నారు. ప్రజావేదిక కూల్చివేతతో మొదలైన విధ్వంసం ఐదేళ్లపాటు కొనసాగిందని, అచ్చెన్నాయుడు నుంచి పట్టాభి వరకు ఎందరో టీడీపీ నేతలపై అక్రమ కేసులు బనాయించారని, చివరికి డీజీపీ కార్యాలయం పక్కనే ఉన్న టీడీపీ కార్యాలయంపై దాడి జరిగినా సమర్థించుకున్నారని ఆమె గుర్తు చేశారు. పాత్రికేయులు, సోషల్ మీడియా కార్యకర్తలు, అమరావతి మహిళలను కూడా సీఐడీ ద్వారా వేధించారని అనిత ఆరోపించారు. ప్రజా సమస్యలపై పోరాటం చేయకుండా, ఎక్కడైనా శవం కనిపిస్తే జగన్ రోడ్లపైకి వస్తున్నారని ఆమె విమర్శించారు. తమ ప్రభుత్వం శాంతిభద్రతల పరిరక్షణకు కట్టుబడి ఉందని, చట్టాన్ని ఉల్లంఘించిన వారు ఎవరైనా కఠిన చర్యలు తప్పవని హెూంమంత్రి వంగలపూడి అనిత హెచ్చరించారు. డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో బాధితుడి కుటుంబ సభ్యుల విజ్ఞప్తి మేరకు పునర్విచారణకు ఆదేశాలు ఇచ్చామని, చట్టం తనపని తాను చేసుకుపోతుందని మంత్రి అనిత పేర్కొన్నారు. ఆధారాలు లభించిన తర్వాతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని, విచారణకు అందరూ సహకరించాలని ఆమె కోరారు.

## దాడి వెనుక ఉన్న వారిని వదిలి పెట్టేది లేదు

- మొదటి పేజీ తరువాయి
ఈ దాడిలో దాదాపు 20 మంది మరణించినట్లు తెలుస్తోంది.
పహల్గాం దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు మోదీ 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. ఈ దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాపం తెలిపిన ప్రధాని, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. దాడి వెనుక ఉన్న వారిని ఎట్టి పరిస్థితుల్లో విడిచిపెట్టే ప్రసక్తి లేదని ప్రధాని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాంటి వారి దుష్ట అజెండా ఎప్పటికీ విజయవంతం కాదని అన్నారు. ఉగ్రవాదంపై పోరాడాలనే తమ సంకల్పం అచంచలమైనదని, ఇలాంటి దాడుల వల్ల అది మరింత బలపడుతుందని అన్నారు.పర్యాటకులపై దాడి ఘటన తీవ్రంగా బాధించిందని కేంద్ర హెూంమంత్రి అమిత్ షా అన్నారు. దాడికి పాల్పడిన వారిని వదిలిపెట్టబోమని అన్నారు. నేరస్థులపై అత్యంత కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఘటన గురించి ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి వివరించానని, సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. అత్యవసర భద్రతా సమీక్ష కోసం శ్రీనగర్ వెళుతున్నట్లు తెలిపారు.

## జగన్ చూసి రమ్మంటే ఇతడు కాల్చి వచ్చేవాడు

- మొదటి పేజీ తరువాయి
నేడు హైదరాబాద్‌లో అరెస్టు చేశారు. ఆయనను విజయవాడకు తరలిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ అరెస్టుపై అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు స్పందించారు. మంగళవారం ఉదయం టీవీలో ఈ వార్త చూసి సంతోషించానని ఆయన అన్నారు. గత జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో పీఎస్సార్ ఆంజనేయులు ఇంటెలిజెన్స్ చీఫ్‌గా అనేక అనైతిక కార్యక్రమాలకు పాల్పడ్డారని రఘురామ ఆరోపించారు. "జగన్ చూసి రమ్మంటే కాల్చి వచ్చిన వ్యక్తి ఇతడు" అని ఆయన తీవ్రంగా వ్యాఖ్యానించారు. నటి జెత్వానీ కేసుతో పాటు, తనపై జరిగిన దాడి కేసులో కూడా పీఎస్సార్ ఆంజనేయులు కీలక పాత్ర పోషించారని రఘురామ ఆరోపించారు. తనపై దాడి జరిగిన కేసులో పీఎస్సార్ ఆంజనేయులు ఏ2 (రెండో నిందితుడు)గా ఉన్నారని రఘురామ గుర్తుచేశారు. ఆయన అరెస్టుతో చాలా మంది తనకు ఫోన్ చేసి, తన కేసు పురోగతి గురించి అడుగుతున్నారని తెలిపారు. ఇదే కేసులో మరో ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్ ప్రమేయం కూడా ఉందని, వీరిద్దరూ కలిసి తనపై దాడికి వ్యూహరచన చేశారని రఘురామ ఆరోపించారు. పీఎస్సార్ ఆంజనేయులును అరెస్టు చేసిన తరహాలోనే, తన కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న పీవీ సునీల్ కుమార్‌ను కూడా అరెస్టు చేస్తారా అని రఘురామ ప్రశ్నించారు. ఇప్పటివరకు సునీల్ కుమార్‌ను కనీసం విచారణకు కూడా పిలవలేదని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. తన కేసులో విచారణ చాలా నెమ్మదిగా (రోడ్డు రోలర్ వేగంతో) సాగుతోందని, విచారణ ఒకసారి వేగం పుంజుకుంటే ఆగదని తాను నమ్ముతున్నట్లు చెప్పారు.తనపై సుమోటో కేసు నమోదు చేసిన సునీల్ నాయక్ అనే వ్యక్తి బీహార్ నుంచి రావడానికి నిరాకరిస్తున్నాడని రఘురామ తెలిపారు. అలాగే, తన కేసులో వైద్య నివేదికలు తారుమారు చేశారని ఆరోపణలు ఎదుర్కొంటున్న డాక్టర్ ను ఇప్పటికే విచారిస్తున్నారని ఆయన వెల్లడించారు. పీఎస్సార్ ఆంజనేయులు అరెస్టుతో తన కేసు విచారణ కూడా వేగవంతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో
# పర్యాటకులపై ఉగ్ర దాడి

పెన్ పవర్ డెస్క్:జమ్ము కశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లా పహల్గాంలో ఉగ్రవాదులు మరోసారి పంజా విసిరారు. పర్యాటకులపై జరిగిన కాల్పుల ఘటనలో ఒకరు మృతి చెందగా, ఆరుగురు గాయపడినట్లు ప్రాథమిక సమాచారం అందుతోంది. ఈ సంఘటనతో పహల్గాంలో ఒక్కసారిగా భయాందోళనలు నెలకొన్నాయి. వివరాల్లోకి వెళితే, పహల్గాంలోని బైసరన్ వ్యాలీ ఎగువ ప్రాంతంలోని ఒక పర్యాటక రిసార్టు వద్ద ఈ దాడి జరిగింది. ఈ ప్రాంతానికి కేవలం కాలినడకన లేదా గుర్రాల ద్వారా మాత్రమే చేరుకునే వీలుంటుంది. ఇలాంటి ప్రాంతంలో పర్యాటకులను లక్ష్యంగా చేసుకుని ఉగ్రవాదులు కాల్పులకు తెగబడ్డారు. సైనిక తరహా దుస్తుల్లో వచ్చిన దుండగులు ఈ దాడికి పాల్పడినట్లు తెలుస్తోంది. పర్యాటకులను లక్ష్యంగా చేసుకుని పక్కా ప్రణాళికతోనే ఈ దాడికి పాల్పడి ఉంటారని అధికారులు అనుమానిస్తున్నారు.
ఘటనపై సమాచారం అందుకున్న వెంటనే భద్రతా బలగాలు, వైద్య బృందాలు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నాయి. గాయపడిన పర్యాటకులను సమీపంలోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. భద్రతా దళాలు ఆ ప్రాంతాన్ని పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకుని, దాడికి పాల్పడిన ఉగ్రవాదుల కోసం ముమ్మర గాలింపు చర్యలు చేపట్టాయి.

# యా హబీబీ, యా హబీబీ....

పెన్ పవర్ డెస్క్:కొత్త వక్ఫ్ చట్టంపై ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ మరోసారి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఢిల్లీలోని తాల్కటోరా స్టేడియంలో జరిగిన వక్ఫ్ వ్యతిరేక సభలో పాల్గొన్న ఆయన, ప్రధాని నరేంద్ర మోదీ సౌదీ అరేబియా పర్యటనను ప్రస్తావిస్తూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఓవైసీ మాట్లాడుతూ, "ప్రధాని మోదీ సౌదీ అరేబియా పర్యటనకు వెళుతున్నారు. అక్కడ సౌదీ యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్‌ను కలిసి 'యా హబీబీ, యా హబీబీ' (నా ప్రియ మిత్రమా) అంటూ ఆప్యాయంగా పలకరిస్తారు. కానీ ఇక్కడికి తిరిగి రాగానే, దుస్తులను బట్టి ముస్లింలను గుర్తించాలని ప్రజలకు పిలుపునిస్తారు" అంటూ విమర్శించారు. ముస్లిం దేశాలలో వక్ఫ్ అనేది లేదంటూ బీజేపీ చేస్తున్న ప్రచారం పూర్తిగా అబద్ధమని ఓవైసీ కొట్టిపారేశారు. "ఫలానా ముస్లిం దేశంలో వక్ఫ్ లేదని పార్లమెంటులో బీజేపీ నేత ఒకరు అన్నారు. నేను ప్రధాని నరేంద్ర మోదీకి చెప్పాలనుకుంటున్నాను. మీ సౌదీ అరేబియా పర్యటనలో, మదీనా నగరం వక్ఫ్ భూమిపైనే నిర్మితమైందా అని అక్కడి యువరాజును అడగండి. అది రాచరికమైనా, ప్రజాస్వామ్య దేశమైనా.. ప్రతీ ముస్లిం దేశంలోనూ వక్ఫ్ వ్యవస్థ ఉంది" అని ఓవైసీ స్పష్టం చేశారు. "2013 వక్ఫ్ బిల్లును పార్లమెంటు ఉభయ సభలు ఏకగ్రీవంగా ఆమోదించాయి. అధికారాల విభజన సిద్ధాంతం ప్రకారం న్యాయ, శాసన, కార్యనిర్వాహక వ్యవస్థలు అన్నీ స్వతంత్రమైనవే. ప్రభుత్వం తన అధికారాలను దుర్వినియోగం చేసినా లేదా రాజ్యాంగంలోని ఏదైనా అధికరణాన్ని దుర్వినియోగం చేసినా, న్యాయవ్యవస్థ జోక్యం చేసుకుంటుంది. న్యాయ వ్యవస్థే లేకపోతే మరి మేం ఎక్కడికి వెళ్లాలి?" అని ప్రశ్నించారు. 'పార్లమెంటే సర్వోన్నతమైనది' అంటూ ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖర్ చేసిన వ్యాఖ్యలను ఓవైసీ మీడియా ఎదుట ప్రస్తావించారు. ఆయన పీటీఐ వార్తా సంస్థతో మాట్లాడుతూ "అది ఆయన (ధన్‌ఖర్) పరిమిత అవగాహన. పార్లమెంట్ కచ్చితంగా సర్వోన్నతమైనది, స్వతంత్రమైనది. అదే సమయంలో న్యాయవ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థలు కూడా స్వతంత్రమైనవే. అందుకే అధికారాల విభజన అనేది మన రాజ్యాంగ మౌలిక స్వరూపంలో భాగం. మీరు తప్పుడు చట్టాలు చేస్తే, రాజ్యాంగ అధికరణాలను దుర్వినియోగం చేస్తే, అప్పుడు న్యాయవ్యవస్థ కచ్చితంగా జోక్యం చేసుకుంటుంది" అని ఓవైసీ వివరించారు.

# పార్లమెంటే సుప్రీం

పెన్ పవర్ డెస్క్:దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టుపై పరోక్షంగా భారత ఉపరాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ మరోమారు కీలక వ్యాఖ్యలు చేశారు. పార్లమెంటే సర్వోన్నతమైనదని, సుప్రీంకోర్టు కన్నా ఉన్నతమైనదని ఆయన స్పష్టం చేశారు. ఈ ఉదయం ఢిల్లీ విశ్వవిద్యాలయంలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. రాజ్యాంగపరమైన విషయాల్లో ప్రజలచే ఎన్నుకోబడిన ప్రతినిధులదే అంతిమ నిర్ణయమని ధన్‌ఖర్ పేర్కొన్నారు. రాజ్యాంగంలో పార్లమెంటును మించిన వ్యవస్థ మరొకటి ఉందని ఎక్కడా పేర్కొనలేదని ఆయన అన్నారు. అన్నింటికన్నా పార్లమెంటే సుప్రీం అని ఆయన తేల్చి చెప్పారు. ఈ సందర్భంగా, ఇందిరా గాంధీ హయాంలో విధించిన ఎమర్జెన్సీ కాలాన్ని ప్రస్తావిస్తూ, ఆ సమయంలో ప్రాథమిక హక్కుల ఉల్లంఘన జరిగిందని ఆయన గుర్తు చేశారు. ఇటీవల కాలంలో కొన్ని బిల్లుల విషయంలో రాష్ట్రపతి ఆమోదానికి నిర్దిష్ట గడువు విధించాలని సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం వివాదానికి తెర తీసింది. అలాగే వక్ఫ్ చట్టానికి సంబంధించిన విచారణను తదుపరి ఆదేశాల వరకు వాయిదా వేయడం వంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఈ నేపథ్యంలోనే ఉపరాష్ట్రపతి తాజా వ్యాఖ్యలు చేసినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. సుప్రీంకోర్టు తీర్పులపై ఇటీవల కొందరు బీజేపీ నేతలు కూడా విమర్శలు చేశారు. సర్వోన్నత న్యాయస్థానమే ఆదేశాలు ఇస్తే, ఇక పార్లమెంట్ మూసేసుకుంటామని కొందరు నేతలు ప్రశ్నించిన విషయం తెలిసిందే. అయితే, సుప్రీంకోర్టుపై బీజేపీ నేతలు చేస్తున్న వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోంది. బీజేపీ నేతలు న్యాయవ్యవస్థను బెదిరించే ప్రయత్నం చేస్తున్నారని కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తున్నారు.

# పోలవరం నిర్వాసితులకు అంత్యోదయ
# కార్డులు అందజేసిన మంత్రి నాదెండ్ల

పెన్ పవర్ డెస్క్:పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు మెరుగైన జీవన పరిస్థితులు కల్పించేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించి అమలు చేస్తామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి, ఏలూరు జిల్లా ఇన్చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. ఏలూరు జిల్లా బుట్టాయిగూడెం మండలం రెడ్డి గణపవరంలోని ఆర్ అండ్ ఆర్ కాలనీలో పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితులకు అంత్యోదయ అన్న యోజన కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణానికి తమ భూములు త్యాగంచేసిన 35 వేల మంది నిర్వాసితుల త్యాగాలను తమ ప్రభుత్వం ఎప్పటికీ మరచిపోదని, వారిని ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందన్నారు. నిర్వాసితులకు ఆహార భద్రతాకీ అంత్యోదయ అన్నా యోజన కార్డులు అందజేసి వారికి ప్రతినెలా 35 కేజీల బియ్యాన్ని ఉచితంగా అందిస్తున్నామన్నారు. నిర్వాసితుల కుటుంబాలలోని యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు
కల్పిస్తామని, ఇందుకోసం ప్రత్యేక సర్వేని నిర్వహిస్తామన్నారు. పునరావాస కాలనీలో రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, విద్యా, వైద్యం తదితర మౌలిక సదుపాయాలను ఆరు నెలలులోగా కల్పించాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

**గిరిజనులతో మంత్రి నాదెండ్ల ఆటా పాటా...**

బర్రింకలపాడులో పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు క్యాంపు కార్యాలయం ప్రారంభోత్సవానికి విచ్చేసిన మంత్రి నాదెండ్ల మనోహర్ కి గిరిజన ప్రజలు గిరిజన సాంప్రదాయ నృత్యాలు, సంగీతాలతో స్వాగతం పలికారు. వారి నాట్యానికి ముగ్దుడైన మంత్రి వారి వద్ద ఉన్న కొమ్ములు ధరించి వారితో కలిసి నృత్యం చేశారు ఎమ్మెల్యే చిర్రి బాలరాజు తదితరులు కూడా గిరిజనుల ఆనందంలో పాలుపంచుకున్నారు.

## ఢిల్లీలో బిజీబిజీగా చంద్రబాబు...
## కేంద్ర జలశక్తి మంత్రితో భేటీ

- మొదటి పేజీ తరువాయి
బనకచర్ల ప్రాజెక్టుకు సంబంధించిన అనుమతులు మంజూరు చేయడంతో పాటు, అవసరమైన ఆర్థిక సహాయం అందించాలని ముఖ్యమంత్రి కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. గోదావరి వరద జలాలను పోలవరం ప్రాజెక్టు ద్వారా తరలించి, పెన్నా నదితో అనుసంధానించే బనకచర్ల ప్రాజెక్టుకు కేంద్రం ఆమోదం లభిస్తే రాయలసీమ నీటి కష్టాలు తీరతాయని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈ రెండు కీలక ప్రాజెక్టులకు కేంద్రం నుంచి సానుకూల స్పందన వస్తుందని ఏపీ ప్రభుత్వం ఆశిస్తోంది.

## విజయసాయిరెడ్డిపై అంబటి రాంబాబు తీవ్ర విమర్శలు

- మొదటి పేజీ తరువాయి
చంద్రబాబు చేతిలోకి వెళ్లారని దుయ్యబట్టారు. తాడేపల్లిలో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. నిజాయతీగా పనిచేసిన ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులును అన్యాయంగా అరెస్ట్ చేశారని అంబటి మండిపడ్డారు. డీజీపీ స్థాయికి వెళ్లాల్సిన అధికారిని ఇలా అరెస్ట్ చేయడం దారుణమన్నారు. చంద్రబాబును గతంలో అరెస్ట్ చేశారన్న కక్షతోనే ఇప్పుడు పీఎస్ఆర్‌ను అరెస్ట్ చేశారని ఆయన ఆరోపించారు. అదే విధంగా, రాజ్ కసిరెడ్డిని కేవలం కక్ష సాధింపుతోనే అరెస్ట్ చేశారని అన్నారు. సినీ నటి జత్వాని అరెస్టు చట్ట ప్రకారమే జరిగిందని, ఆమె ఒక బ్లాక్ మెయిలర్ అని, ఈ విషయం ముంబైలో అందరికీ తెలుసని చెప్పారు. ఈ అరెస్టుల వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని అంబటి రాంబాబు ఆరోపించారు. లోకేశ్ సృష్టించిన 'ఉర్స' అనే సంస్థకు రూ. 3 వేల కోట్ల విలువైన ఆస్తులను బదలాయించారని, ఈ విషయం బయటకు పొక్కకుండా ఉండేందుకే పీఎస్ఆర్, కసిరెడ్డిలను అరెస్ట్ చేసి ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తున్నారని ఆయన విమర్శించారు. రాష్ట్రంలో దుర్మార్గమైన పరిపాలన సాగుతోందని, శాశ్వతంగా మీరే అధికారంలో ఉంటారని భావిస్తున్నారా? అని అంబటి కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పోలీసుల విషయంలో న్యాయస్థానాలు మొట్టికాయలు వేస్తున్నా ప్రభుత్వానికి సిగ్గులేదని, ఇలాంటి దృష్టి మళ్లించే రాజకీయాలు చేయడం సిగ్గుచేటని విమర్శించారు. గోరంట్ల మాధవ్ వ్యవహారంలో 11 మంది పోలీసు అధికారులను సస్పెండ్ చేయడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అధికారులను సస్పెండ్ చేయాల్సిన అవసరం లేదని, దీనికి బాధ్యత వహిస్తూ హెూంమంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో హెూంమంత్రి, ఇతర అధికారులు లోకేశ్ కనుసన్నల్లో పనిచేస్తున్నారని అంబటి ఆరోపించారు. ఈ అక్రమ అరెస్టులకు చంద్రబాబు ప్రభుత్వం కచ్చితంగా మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఆ మూల్యం దేవుడు, ప్రజలు ఏ విధంగా నిర్ణయిస్తారో త్వరలోనే చూస్తారని అన్నారు.

## పీఎస్ఆర్ ఆంజనేయులు అరెస్ట్‌పై రోజా ఫైర్

- మొదటి పేజీ తరువాయి
వైసీపీ కేంద్ర కార్యాలయంలో ఆమె మీడియా సమావేశంలో మాట్లాడారు. పీఎస్ఆర్ ఆంజనేయులు అరెస్టును 'డర్టీ డైవర్షన్ పాలిటిక్స్'గా అభివర్ణించిన రోజా, ప్రభుత్వం ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. "ఎన్నికల ముందు ఎన్నో హామీలిచ్చారు. మెగా డీఎస్సీపై తొలి సంతకం పెట్టిన చంద్రబాబు, ఇప్పటివరకు దాన్ని ఎందుకు అమలు చేయలేదు? ఆ సంతకం చిత్తు కాగితంతో సమానమా?" అని ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. హామీలు నెరవేర్చలేని నిస్సహాయతతోనే, ఎదురుదాడి చేసేందుకు, భయభ్రాంతులకు గురిచేసేందుకు వైసీపీ నేతలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని, ఇలాంటి వాటికి ఎవరూ భయపడరని స్పష్టం చేశారు. ప్రభుత్వం నిజంగా చిత్తశుద్ధితో ఉంటే, గత ప్రభుత్వ హయాంలో జరిగినట్లు ఆరోపిస్తున్న ఫైబర్ నెట్, స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లపై విచారణ జరిపించాలని రోజా సవాల్ విసిరారు. అమరావతి టెండర్ల వ్యయాన్ని రూ.36 వేల కోట్ల నుంచి రూ.77 వేల కోట్లకు ఎందుకు పెంచారని నిలదీశారు. ఇది కేవలం దోపిడీకి సిద్ధమవ్వడమేనని, దీనిపై ప్రధాని మోదీ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. గతంలో చంద్రబాబు రాష్ట్రాన్ని ఏటీఎంలా వాడుకుంటున్నారని స్వయంగా ప్రధాని అన్న మాటలను ఆమె గుర్తు చేశారు. టీటీడీ గోశాలలో వందలాది ఆవులు, శ్రీకూర్మంలో తాబేళ్లు చనిపోయిన ఘటనలపై పవన్ కళ్యాణ్ మౌనం వహించడాన్ని రోజా తప్పుబట్టారు. సనాతన ధర్మం గురించి మాట్లాడే పవన్, ఈ ఘటనలపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. కేవలం చంద్రబాబుకు అనుకూలంగా మాట్లాడటమే పవన్ పని అని, ప్రజా సమస్యలను పట్టించుకోరని విమర్శించారు. వైసీపీ హయాంలో మద్యం దుకాణాలు తగ్గిస్తే, టీడీపీ ప్రభుత్వం ఇప్పుడు వాటిని పెంచుతూ లంచాలు దండుకోవాలని చూస్తోందని ఆరోపించారు. ఎంపీ మిథున్ రెడ్డిపై కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే మద్యం పాలసీతో ముడిపెట్టి కేసులు పెట్టాలని చూస్తున్నారని అన్నారు. ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు మానుకుని, ఇచ్చిన హామీలను అమలు చేయడంపై దృష్టి పెట్టాలని రోజా హితవు పలికారు. అక్రమ కేసులతో వైసీపీ నేతల స్థైర్యాన్ని దెబ్బతీయలేరని ఆమె హెచ్చరించారు.

## ప్రధాని మోదీకి ఫైటర్ జెట్లతో సౌదీ అరేబియా అపూర్వ స్వాగతం..

- మొదటి పేజీ తరువాయి
చెందిన యుద్ధ విమానాలు దానిని అనుసరిస్తూ ప్రత్యేక గౌరవం అందించాయి. ప్రధాని విమానానికి ఇరువైపులా ఎస్కార్ట్‌గా వచ్చిన ఎఫ్-15 ఫైటర్ జెట్‌లు ఆయనకు స్వాగతం పలికినట్లు విదేశాంగ శాఖ విడుదల చేసిన వీడియోలో స్పష్టంగా కనిపిస్తోంది. ఇటువంటి గౌరవం చాలా అరుదుగా లభిస్తుంది. ఈ ప్రత్యేక స్వాగతం ఇరు దేశాల మధ్య, ముఖ్యంగా రక్షణ రంగంలో బలపడుతున్న సంబంధాలకు నిదర్శనంగా విశ్లేషకులు భావిస్తున్నారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం ప్రధాని మోదీ సౌదీ అరేబియా చేరుకున్నారు. ఈ పర్యటనలో ప్రధానంగా ఇంధనం, వాణిజ్యం, రక్షణ వంటి కీలక రంగాల్లో ఇరు దేశాల మధ్య సహకారాన్ని మరింత బలోపేతం చేయడంపై దృష్టి సారించనున్నారు. ఇటీవల ప్రధాని మోదీ, సౌదీ యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్‌ల మధ్య జరిగిన చర్చల అనంతరం పలు కీలక ఒప్పందాలు కుదిరాయి. ఈ నేపథ్యంలో తాజా పర్యటన మరింత ప్రాధాన్యతను సంతరించుకుంది. భారత్, సౌదీ అరేబియాల మధ్య ఇప్పటికే బలమైన వ్యూహాత్మక భాగస్వామ్యం కొనసాగుతోంది. ఈ పర్యటన ద్వారా ద్వైపాక్షిక సంబంధాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని ఇరు దేశాలు ఆకాంక్షిస్తున్నాయి.

# జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడికి ఘనసన్మానం.

**వెంకటాచలం, (పెన్ పవర్) ఏప్రిల్ 22**

వెంకటాచలం మండలం కనుపూరు జెడ్పీ హైస్కూల్ లో ప్రధానోపాధ్యాయుడు ఉక్కం మురళీ మోహన్, ఆయన సతీమణి మంజులని మంగళవారం ఘనంగా సన్మానించారు. మురళి మోహన్ స్వచ్ఛంద పదవీ విరమణ సందర్భంగా తోటి ఉపాధ్యాయులు, స్నేహితులు, బంధువులు ఘనంగా సత్కరించారు. ఆయనతో వారి అనుబంధాలని నెమరవేసుకున్నారు. మురళి మోహన్ మాట్లాడుతూ 36 ఏళ్ల పాటు ప్రధానోపాధ్యాయుడిగా సేవలందించానని చెప్పారు. ఎంతో మంది తన వద్ద చదువుకున్న విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించారని, ఇప్పటికీ తనకి ఫోన్లు చేస్తుంటారని చెప్పారు. ఇటీవల తాను అనారోగ్యానికి గురైన సమయంలో, హైదరాబాదులో తన విద్యార్థి అరుదైన రోబోటిక్ ఆపరేషన్



చేశారని తెలిపారు. చిన్నప్పటి నుంచి పాఠశాలతోనే తన అనుబంధం కొనసాగడం ఆనందంగా ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో హరిత, రఫీ, ఉమామహేశ్, పెంచలయ్య, ప్రసన్నలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

పెన్ పవర్
నెల్లూరు । తిరుపతి । చిత్తూరు

# 26న మండల సర్వసభ్య సమావేశం

**సీతారామపురం పెన్ పవర్-ఏప్రిల్ 22**

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 26వ తేదీ ఉదయం 10.30 గంటలకు మండల సర్వ సభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో భాస్కర్ మంగళవారం తెలిపారు. ఎంపీపీ చింతం రెడ్డి పద్మావతి అధ్యక్షతన జరిగే సమావేశంలో మండలాభివృద్ధిపై సమీక్షించినట్లు చెప్పారు మండలంలోని ప్రజా ప్రతినిధులు అన్ని శాఖల కారులు విధిగా హాజరుకావాలని కోరారు.

# సంఘ బంధం మహిళలకు సూచనలు ఇస్తున్న వెలుగు సిసి టి శ్రీనివాసులు



**సీతారాంపురం పెన్ పవర్-ఏప్రిల్ 22**

ఈరోజు సీతారాంపురంలోని పొదుపు సంఘాల మహిళలతో . వెలుగు సిసి టి శ్రీనివాసులు బ్యాంకుకు సంబంధించిన రుణాలపై మరియు సంఘ బంధం. శ్రీనిధి రుణాలపై పలు సూచనలు ఇచ్చారు. బ్యాంకులో తీసుకున్న రుణాలు నెలవారి వాయిదాలలో తప్పనిసరిగా పెట్టాలని లేదా ఎన్పీఏ చేరుతుందని చెప్పారు.. బ్యాంకులో తీసుకున్న రుణాలు ఒక క్రమ పద్ధతిలో కట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీతారాంపురం పంచాయతీలోని అన్ని పొదుపు గ్రూపుల లీడర్లు పాల్గొన్నారు. ఇలాగే నెలలో ఒకసారి మీటింగ్ జరుగుతుందని ఆ మీటింగ్ కి ప్రతి ఒక్కరు హాజరుకావాలని సిసి శ్రీనివాసులు కోరారు ఈ కార్యక్రమంలో వి ఓ ఏ ఎస్కే దిల్షాద్. వివో లు ఈసీ లు మరి పొదుపు మహిళలు పాల్గొన్నారు,

# లైసెన్సులు తప్పక కలిగి ఉండాలి

## ఎస్సై శివకృష్ణారెడ్డి







**సీతారాంపురం పెన్ పవర్-ఏప్రిల్ 22**

వాహనాలు నడిపేవారు తప్పనిసరిగా లైసెన్సులు కలిగి ఉండాలని సీతారామపురం ఎస్ఐ శివకృష్ణారెడ్డి హెచ్చరించారు. సీతారామపురంలో మంగళవారం వాహనాలను తనిఖీ చేశారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా లైసెన్సులు కలిగి ఉండాలని, హెల్మెట్ తప్పక ధరించాలని సూచించారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదని హెచ్చరించారు. వాహనదారులు లైసెన్సులతోపాటు, వాహనాలకు భీమా కలిగి ఉండాలన్నారు.

# కన్ను నల్ల గుడ్డు మార్పిడి ఆపరేషన్ విజయవంతం

**వెంకటాచలం, (పెన్ పవర్) ఏప్రిల్ 22**

వెంకటాచలం మండల కేంద్రంలోని స్వర్ణ భారత్ ట్రస్ట్ ఆవరణంలో ఉన్న ఎల్వీ ప్రసాద్ ఐ హాస్పిటల్ నందు వినూత్నమైన శాస్త్ర చికిత్స కన్ను నల్ల గుడ్డు మార్పిడి విజయవంతంగా జరిగినది. ఇటువంటి ఆపరేషన్ పెద్ద పెద్ద నగరాలలో చేయడం జరుగుతుంది. అలాంటిది వెంకటాచలంలో ఈ నల్ల గుడ్డు ఆపరేషన్ అందుబాటులో నెలకు ఒకసారి జరుగుతుంది. మొట్టమొదటిసారి నెల్లూరు జిల్లా వెంకటాచలం లో ఒకే రోజు ఐదు ఆపరేషన్లు విజయవంతంగా జరిగాయి. మన జిల్లా పరిసర ప్రాంతాల వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాల్సిందిగా ఐ హాస్పిటల్ వారు మనివి చేస్తున్నారు. ఈ ఆపరేషన్ చేసిన డాక్టర్ సుషాల్ , డాక్టర్ ఆదిత్య, డాక్టర్ మౌనిక పాల్గొన్నారు. ఈ సమావేశంలో పర్సనల్ అడ్మిన్ వాసు బాబు, సెంటర్ అడ్మిన్ వెంకట్రావు, మరియు అనుప్ బాబు పాల్గొన్నారు.





# వి.ఎస్.యూ.లో ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్ పోస్టర్ బ్రోచర్ ఆవిష్కరణ




**వెంకటాచలం (పెన్ పవర్) ఏప్రిల్ 22**

మండల కేంద్రంలోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో ఈ నెల 30వ తేదీ నుండి మే 8వ తేదీ వరకు జరగనున్న ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్ సందర్భంగా మంగళవారం విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని శ్రీ పొట్టి శ్రీరాములు భవనంలోపోస్టర్ మరియు బ్రోచర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు మాట్లాడుతూ:...... "దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాల నుండి 93 మహిళల జట్లు ఈ నెల 30వ తేదీ నుండి మే 3వ తేదీ వరకు టోర్నమెంట్‌లో పాల్గొంటాయి. అనంతరం మే 4వ తేదీ నుండి 8వ తేదీ వరకు 95 పురుషుల జట్లు పోటీపడతాయి" అని తెలిపారు. విశ్వవిద్యాలయం క్రీడా విభాగం ఆధ్వర్యంలో ఈ పోటీలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్టర్ డాక్టర్ కే.సునీత కళాశాల ప్రిన్సిపల్ ఇంచార్జ్ డాక్టర్ ఎం.హనుమారెడ్డి,స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ డాక్టర్ సిహెచ్.వెంకట్రాయులు, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఆర్. మధుమతి,డీన్ సి డి సి డాక్టర్ ఎం హుస్సేనయ్య , ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ ఉదయ్ శంకర్ అల్లం, సహాయక రిజిస్టర్ సుజయ్ కుమార్, స్పోర్ట్స్ బోర్డ్ సిబ్బంది ఏ.అజయ్ పిడి ప్రవీణ్ కుమార్, డాక్టర్ కృష్ణారెడ్డి, డాక్టర్ సుబ్రహ్మణ్యం నాయుడు, డాక్టర్ లక్ష్మీప్రసన్న, మరియు అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

# పాఠశాలలో బాత్ రూమ్స్, వాష్ రూమ్స్ ప్రారంభం









**వేటపాలెం,పెన్ పవర్,ఏప్రిల్ 22**

వేటపాలెంలోని సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో నూతనంగా నిర్మించిన బాత్ రూమ్స్, వాష్ రూమ్స్ నిర్మాణాలను చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య ప్రారంభించారు. కార్యక్రమంలో ఆప్కో ఛైర్మన్ సజ్జ హేమలత, ఏఎంసీ ఛైర్మన్ కౌతరపు జనార్దన్, చీరాల పర్చూరు టీడీపీ, జనసేన సమన్వయకర్త రవికుమార్, వీరభద్రయ్య,వెంకటరావు, పూర్ణ, బాలకృష్ణ,కొత్త నాగు,పల్లపోలు శ్రీనివాసరావు,శివ నాగ మల్లేశ్వరి,మాజీ ఉప సర్పంచ్ భానుమూర్తి ,ఉమ్మిటి శంకర్,ఎమ్మార్వో పార్వతి,ఎంపీడీవో రాజేష్ బాబు, ఉపాధ్యాయులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# మొక్కలు నాటుతున్న మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్

## మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలి

**పెన్ పవర్ బ్యూరో బాపట్ల ఏప్రిల్ 22:**

ప్రజలందరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని మాజీ శాసనమండలి సభ్యులు అన్నం సతీష్ ప్రభాకర్ అన్నారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు రాజమండ్రి పార్లమెంటు సభ్యులు దగ్గుబాటి పురుందేశ్వరి 65వ జన్మదినాన్ని పురస్కరించుకొని బిజెపి నాయకులు కొండారెడ్డి అనిల్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మొక్కల నాటి కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్, భారతీయ జనతా పార్టీ బాపట్ల జిల్లా అధ్యక్షులు బంగారు బాబు, మాజీ జిల్లా పార్టీ అధ్యక్షుడు యార్లగడ్డ లక్ష్మీనారాయణ తో కలిసి మండల పరిధిలోని స్టువర్టుపురం గ్రామంలో మొక్కలు నాటారు. సందర్భంగా అన్నం సతీష్ ప్రభాకర్ మాట్లాడుతూ రహదారుల వెంబడి మొక్కలు నాటడం ద్వారా నీడనివ్వడంతో పాటు చల్లని గాలులు ఇస్తాయని రోజురోజుకీ పెరుగుతున్న కాలుష్యాన్ని నివారించడానికి చెట్లు ఎంతగానో ఉపయోగపడతాయి అన్నారు. ప్రతి నివాసానికి చెందిన ప్రతి ఒక్కరు ఒక్కొక్క మొక్కను నాటి పర్యావరణాన్ని రక్షించాలని పెరుగుతున్న కాలుష్యాన్ని నివారించాలని ఆయన కోరారు. మొక్కలు



నాటే కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన కొండారెడ్డి అనిల్ ను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో పలువురు బిజెపి నాయకులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణకై బాలబాను విద్యార్థులు ర్యాలీ

## ప్రపంచ ధరిత్రీ దినోత్సవం పై బాలభాను విద్యార్థులు చైతన్య ర్యాలీ




**పెన్ పవర్ కారంపూడి ఏప్రిల్ 22**

కారంపూడి గ్రామంలో పాఠశాల నందు 'మన శక్తి మనగ్రహం'అనే అంశంపై ప్రపంచ ధరిత్రి దినోత్సవం సందర్భంగా కారంపూడి ప్రజలను చైతన్యవంతం చేయడానికి బాలబాను విద్యార్థులు గ్రామ కోడలిలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు ఈ నినాదాలతో పలు రకాల అవగాహన ఫ్లస్ కార్డులను విద్యార్థులు ప్రదర్శిస్తూ పర్యావరణాన్ని పరిరక్షించడానికి మరియు అమలు చేయడానికి కదలి రావాలని గ్రామస్తులకు పిలుపునిచ్చారు. వాతావరణం లో వస్తున్న మార్పులను దృష్టిలో ఉంచుకొని క్లీన్ ఎనర్జీ ఉత్పత్తిని గణనీయంగా పెంచడానికి ప్రతి ఒక్కరూ పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగాన్ని ప్రోత్సహించడమే లక్ష్యముగా కొనసాగాలని ప్రిన్సిపల్ డాక్టర్ కంఠం రెడ్డి సత్యనారాయణ అన్నారు. ప్రతి పౌరుడు దీనిని బాధ్యతగా ప్రతినిత్యం వహించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మొక్కలు పెంచడం ద్వారా వాతావరణంలో పెరుగుతున్న కాలుష్యాన్ని తగ్గించడంలో విద్యార్థులు తమ వంతు పాత్ర పోషించాలని హెచ్ ఎం విష్ణు ప్రియ పిలుపునిచ్చారు ఈ సందర్భంగా విద్యార్థులు పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటారు. ఈ 55వ గ్లోబుల్ ఎర్త్ డే వేడుకలు సందర్భంగా వివిధ పోటీలలో విజేతలకు యోగ చారిటబుల్ ట్రస్ట్ జ్ఞాపికలను అందజేసింది. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ శివానందం మాస్టర్. రేఖ సుబ్బారావు. పార్వతి. పలువురు ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# పౌష్టికాహార పక్షోత్సవం

## మునగాకు. కరివేపాకు. పొడితో రక్తహీనత దూరం




**పెన్ పవర్ కారంపూడి ఏప్రిల్ 22**

మండల కేంద్రమైన కారంపూడి పట్టణంలో 7 నందు ఈరోజు చివరి రోజు కావడంతో కారంపూడి గ్రామంలో ఉన్న అంగన్వాడి టీచర్లు మునగాకు పొడి డెమో చేసి చూపించారు .ఆ పొడి తల్లులకు తయారీ విధానాన్ని తెలియజేశారు .కావాల్సిన పదార్థాలు కలిపి చేశారు. ఈ మునగాకు కరివేపాకు పొడి ప్రతి రోజూ అన్నం తినేటప్పుడు ఒక టీ స్పూన్ పొడి వేసుకొని తింటే రక్తం వృద్ధి చెందుతుంది. ఐరన్ ఎక్కువగా ఉంటుంది తల్లి బిడ్డ ఇద్దరు క్షేమంగా ఉంటారు . ఆరోగ్యకరమైన గర్భిణి ప్రసవించే నాటికి 12 గ్రాములు రక్తం శాతం ఉండాలి. ఈ పొడి ద్వారా రక్తహీనతను నివారించవచ్చు. గర్భిణులు. బాలింతలు .ఇద్దరూ తీసుకోవచ్చు వాళ్లే కాకుండా ఈ పొడిని ఎవరైనా తినవచ్చు .ఈ విషయాలను సుహాసిని టీచర్ తెలియజేశారు .కారంపూడి అంగన్వాడీ టీచర్ సైదమ్మ, శకుంతల ,లక్ష్మీబాయి ,నరసమ్మ, అచ్చమ్మ ,శివకుమారి ,దయామని, రమణ , కీర్తి,మరియు తల్లులు గర్భిణీలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు...



# ఏకేయూ మొదటి సెమిస్టర్ డిగ్రీ ఫలితాలు విడుదల

## ఉత్తీర్ణులైన విద్యార్థులకు అభినందనలు తెలిపిన విసి, రిజిస్ట్రార్





**బ్యూరో పెన్ పవర్, ప్రకాశం ఏప్రిల్ 22:**
ఏ.కే.యూ పరిధిలో గల డిగ్రీ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులకు డిసెంబర్– 2024లో నిర్వహించిన మొదటి సెమిస్టర్ యూజి పరీక్షల ఫలితాలను ఏ.కే.యూ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డి.వి.ఆర్.మూర్తి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి. హరిబాబు,ఏ.సి.ఈ డాక్టర్ ఏ.భారతీదేవి తదితరులు మంగళవారం సాయింత్రం విడుదల చేశారు. ఆంధ్ర కేసరి యూనివర్శిటీ పరిధిలో ఉన్న 88 కళాశాలల నుంచి మొత్తం 8114 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, వీరిలో 3956 మంది విద్యార్థులు 48.76 శాతం మేరకు ఉత్తీర్ణత సాధించినట్లు వి.సి.ప్రొఫెసర్ మూర్తి విలేఖరులకు తెలిపారు.బి.ఏ హానర్స్ విభాగంలో 471 మందికి 184 మంది, బి.కాం కంప్యూటర్ అప్లికేషన్స్ విభాగంలో 2703 మందికి 1007 మంది, బి.కాం జనరల్ విభాగంలో 104 మందికి 59 మంది, బి.వొకేషనల్ విభాగంలో 38 మందికి 18 మంది, బి.ఎస్సీ హనర్స్ విభాగంలో 3556 మందికి 2072 మంది, బి.బి.ఏ. విభాగంలో 97 మందికి 25 మంది, బి.సి.ఏ. విభాగంలో 1145 మందికి 591 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ఏ.కే.యూ అదనపు పరీక్షల నియంత్రణ అధికారిణి డాక్టర్ అంచుల భారతీ దేవి తెలిపారు. ఈ ఫలితాలను యూనివర్శిటీ రిజల్ట్స్ లింకు ద్వారా తెలుసుకోవచ్చునని ఆమె పేర్కొన్నారు.ఈ సందర్భంగా వి.సి.ప్రొఫెసర్ డి.వి.ఆర్.మూర్తి మాట్లాడుతూ ప్రస్తుతం రెండో బ్యాచ్ మొదటి సెమిస్టర్ పరీక్షల ఫలితాలను విడుదల చేయడం జరిగిందని అన్నారు. భవిష్యత్ లో విద్యార్థులు ఇంకా మంచి ఫలితాలను సాధించాలని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు.ఉత్తీర్ణత సాధించిన విద్యార్థినీ విద్యార్థులతో బాటు అత్యుత్తమ ప్రతిభను కనబరిచిన విద్యార్థినీ విద్యార్థులను వి.సి ప్రొఫెసర్ డి.వి.ఆర్.మూర్తి,రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.హరిబాబు తదితరులు హృదయ పూర్వకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో సి.డి.సి డీన్ అండ్ డి.ఓ.ఏ ప్రొఫెసర్ సోమ శేఖర, సి.ఈ. డాక్టర్ కే.వి.ఎన్. రాజు,ఏ.సి.ఈ డాక్టర్ అంచుల భారతీ దేవి,పి.జి అండ్ ప్రొఫెషనల్ కోర్సెస్ నాన్ కాన్ఫిడెన్షియల్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఆర్ శ్రీనివాస్,ఏ.సి.ఈ సహాయకులు డాక్టర్ ఎన్.సురేష్ తో బాటు పరీక్షా విభాగపు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# సచివాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే





**కందుకూరు పెన్ పవర్,ఏప్రిల్ 22:**
మండల పరిధిలోని మాచవరం గ్రామంలో ఉన్న సచివాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఉదయం కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయంలో పనిచేసే సిబ్బంది హాజరును ఎమ్మెల్యే పరిశీలించారు. ప్రజా సమస్యల పై తక్షణమే స్పందించాలని, ప్రజా సంక్షేమమే పరమావధిగా, ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలను ప్రజలకు అందించే విధంగా ఉద్యోగులు పని చేయాలని, సమయపాలన విధిగా పాటించాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సచివాలయ సిబ్బందికి సూచించారు. అనంతరం సచివాలయ.. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందితో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రత్న జ్యోతి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# పాలకేంద్రం భూములను పరిశీలించిన జాయింట్ కలెక్టర్



**కలెక్టరేట్ ఒంగోలు, పెన్ పవర్ ఏప్రిల్ 22**
ప్రకాశం జిల్లా పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం యొక్క భూములు అన్యాక్రాంతం అవుతున్నాయన్న వార్త కథనాలు నేపథ్యంలో ప్రకాశం జిల్లా జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ రోణంకి, రెవిన్యూ డివిజనల్ అధికారి ఒంగోలు, తహసీల్దార్, సంతనూతలపాడు, సర్వే, భూ రికార్డుల శాఖకు సంబంధించిన అధికారులు సదరు డైరీ భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రకాశం పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం భూములను అత్యవసరంగా సర్వే చేసి వాటి హద్దులను, హద్దురాళ్ళను ఏర్పాటు చేయవలసిందిగా ఆదేశించారు.ఈ సందర్భంగా కొంతమంది తమకు పేర్నమిట్ట సర్వే నెంబర్ 140 లో ఇంటి ఎలివేషన్ నివేశన స్థలాలను రిజిస్టర్ డాక్యుమెంట్లు ద్వారా కొనుగోలు చేశామని జాయింట్ కలెక్టర్ ని సంప్రదించగా వారి డాక్యుమెంట్లను తీసుకొని పరిశీలించి తగు చర్యలను తీసుకోవాల్సిందిగా హాజరైన అధికారులను జాయింట్ కలెక్టర్ ఆదేశించారు.



# దివ్యాంగులలో ఉత్సాహం నింపిన సబ్ కలెక్టర్





**కందుకూరు పెన్ పవర్, ఏప్రిల్ 22:**
పట్టణంలోని కోవూరు రోడ్డు లో ఉన్న దివ్యాంగుల పాఠశాలలలో మంగళవారం సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజ తన కుటుంబ సభ్యులతో కలిసి పరిశీలించి దివ్యాంగులలో కొత్త ఉత్తేజాన్ని నింపారు. సబ్ కలెక్టర్ రాకతో దివ్యాంగులు ఆనందోత్సవంలో మునిగిపోయారు. దివ్యాంగులతో సబ్ కలెక్టర్ ప్రేమానురాగాలతో ఆప్యాయంగా పలకరించి వారిని దగ్గరికి తీయడం అందరిని ఆశ్చర్యపరిచింది. ఒక ఉన్నత అధికారిని అన్న దర్పం లేకుండా అందరితో తమ సొంత ఇంటి వారితో ఉన్నట్టే నడుచుకోవటం చూసిన ప్రతి ఒక్కరూ ప్రశంసలు కురిపించారు. దివ్యాంగుల కోసం తనతో పాటు తీసుకొచ్చిన పెన్సిల్లు, పుస్తకాలు, పెన్నులు తోపాటు వారికి అవసరమైన ఆట వస్తువులను దివ్యాంగులకు సబ్ కలెక్టర్ అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మానసికంగా ఇబ్బందులు పడుతున్న దివ్యాంగులను గౌరవించి వారికి ప్రేమను పంచాలని ఆమె కోరారు. వారితో సెల్ఫీలు దిగి వారిని మరింత ఉత్సాహపరిచింది. అనంతరం పాఠశాల పరిసరాలను పరిశీలించి, దివ్యాంగులకు అందించే వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు.

# పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

## ఏఐటియుసి, సిఐటియు



**కందుకూరు పెన్ పవర్, ఏప్రిల్ 22**
మున్సిపాలిటీలో పనిచేసే పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కారం చేయాలని ఏఐటియుసి సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులకు రావలసిన పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని మున్సిపాలిటీ పెరిగిన జనాభా ప్రాతిపదికన పారిశుద్ధ కార్మికుల సంఖ్య పెంచాలని పారిశుద్ధ్య కార్మికులకు రావాల్సిన కనీస వసతులను సకాలంలో అందించాలని వారు కోరారు. మున్సిపాలిటీలో పారిశుద్ధ్య కార్మికులు తక్కువగా ఉన్నందున అన్ని పనులకు వారిని వినియోగిస్తున్నారని దాంతో పారిశుధ్య సమస్య పరిష్కారం కావడంలేదని వారు తెలిపారు. పారిశుద్ధ్య కార్మికులపై పని భారం ఎక్కువ వేయటం వల్ల పారిశుద్ధ్య కార్మికులు సైతం ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని పారిశుద్ధ్య కార్మికుల సంఖ్య పెంచి మున్సిపాలిటీలో పేరుకుపోతున్న పారిశుద్ధ్య సమస్యను పరిష్కరించాలని వారు కోరారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ కే అనుషకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ ఉమ్మడి ప్రకాశం జిల్లా మాజీ అధ్యక్షులు సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బూసి సురేష్ బాబు, ఏఐటియుసి నియోజకవర్గ కార్యదర్శి వై.ఆనంద మోహన్, సిఐటియు నాయకులు ఎస్ ఏ గౌస్, ఏఐటీయూసీ అనుబంధ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కాకుమాని రవణమ్మ, నాయకులు పులి నాగేశ్వరరావు, మహేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

# చలివేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే







**వేటపాలెం,పెన్ పవర్,ఏప్రిల్ 22**
వేసవి కాలం ప్రారంభై ఎండలు విపరీతంగా పెరుగుతున్న తరుణంలో పాదచారులు, ప్రజలు, ఆటో డ్రైవర్లు, చిరు వ్యాపారుల దాహం తీర్చేందుకు అలాంటి వారి అవసరాలను గుర్తించి ప్రజల దాహార్తిని తీర్చేందుకు వేటపాలెం సెంటర్ నందు 'చలివేంద్రం ప్రారంభోత్సవం చేసిన చీరాల శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య . ఈ సందర్భంగా శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య మాట్లాడుతూ, వేసవి కాలంలో గొంతు ఎండిపోతుంటుంది. అందుకే చుక్క నీటి కోసం అల్లాడిపోతుంటాం. ఇక రోడ్డుపైకి వస్తే మండుటెటండంలో దాహర్తి వేస్తూ ఉంటుంది . అందుకని వేసవి కాలాన్ని దష్టిలో ఉంచుకొని సామాన్య ప్రజలకు, పాదచారులకు, అందరి దాహార్తిని తీర్చేందుకు ఈచలివేంద్రం ఏర్పాటు చేసినట్లు దీన్ని ప్రజలు సద్వినియెగం చేసుకోవాలని కోరారు. మొదటిరోజు మజ్జిగ పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో ఆప్కో చైర్మన్ సజ్జ హేమలత , ఏఎంసీ చైర్మన్ కౌతరపు జనార్ధన్ చీరాల పర్చూరు తెలుగుదేశం జనసేన సమన్వయకర్త పొగడదండ రవికుమార్ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు వీరభద్రయ్య , పల్లపోలు శ్రీనివాసరావు శివ నాగమల్లేశ్వరి బాలకృష్ణ, నాగు,మాజీ ఉప సర్పంచ్ భానుమూర్తి, కూటమి నాయకులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలి

## ఇబ్బందులు లేకుండా ప్రజలకు మంచినీరు అందించాలి

## మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి



**బ్యూరో పెన్ పవర్, ప్రకాశం ఏప్రిల్ 22**
కొండపి నియోజకవర్గంలో అన్ని గ్రామాలకు ఇబ్బంది లేకుండా మంచినీరు సరఫరా చేయాలని సంబంధిత అధికారులను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి ఆదేశించారు. మంగళవారం నాడు తూర్పునాయుడుపాలెం లోని క్యాంపు కార్యాలయంలో కొండపి నియోజకవర్గ గ్రామీణ నీటి సరఫరా అధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...ప్రస్తుతం వేసవి దృష్ట్యా నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా మంచినీరు అందించాలన్నారు. నియోజకవర్గంలో ఎంత నీరు అవసరం ఉంది, నీటి సరఫరాకు ఏమైనా సమస్యలున్నాయా అని సంబంధిత విషయాలను అధికారులను మంత్రి అడిగి తెలుసుకున్నారు. పాడైపోయిన మోటార్లకు వెంటనే మరమ్మతులు చేయాలన్నారు. ప్రజా సంక్షేమమే ద్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని, అధికారులంతా బాధ్యతాయుతంగా పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఈ సందర్భంగా మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు.

# శక్తి యాప్‌ను, మనమిత్ర పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

### అల్లినగరంలో నిర్వహిస్తున్న సర్వేలను పరిశీలించిన ఎంపీడీవో మస్తాన్ వలి.

### శక్తి యాప్ ,మనమిత్ర పథకాన్ని పై ప్రజలకు అవగాహన కల్పించిన ఎంపీడీవో.





**కొమరోలు పెన్ పవర్ ఏప్రిల్ 22.**

రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సౌకర్యార్థం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న శక్తి యాప్ ను, మనమిత్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కొమరోలు ఎంపీడీవో సయ్యద్ మస్తాన్ వలి కోరారు. శక్తి యాప్, మన మిత్ర పథకాలకు సంబంధించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు గ్రామ సచివాలయాల సిబ్బంది సోమవారం నుంచి గ్రామాలలో విస్తృతంగా పర్యటిస్తూ శక్తి యాప్ మన మిత్ర లకు సంబంధించిన కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేస్తూ, వాటిపై అవగాహన కల్పిస్తున్నారు. సదరు కార్యక్రమాలను పర్యవేక్షించే కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఎంపీడీవో అల్లినగరం గ్రామ సచివాలయం పరిధిలోని అల్లినగరం, తిమ్మారెడ్డి పల్లె తదితర గ్రామాలలో పర్యటించారు. ఆ సందర్భంగా ఆయన గ్రామ సచివాలయాల సిబ్బందికి తగు సూచనలు సలహాలు ఇవ్వటమే కాక ప్రజలకు ప్రభుత్వ పథకాలు శక్తి యాప్, మనమిత్ర పథకాలకు సంబంధించి అవగాహన కల్పించారు. సైబర్ నేరాల పట్ల ప్రజల అప్రమత్తంగా ఉండాలని ,అపరిచిత వ్యక్తుల ఫోన్లకు, వారి పెట్టే మెసేజ్ లకు స్పందించవద్దని ఆయన కోరారు. అత్యాశకు పోయి ఆన్లైన్ బెట్టింగుల మాయలో పడి యువత అన్ని విధాలుగా నష్టపోతున్నారని, అంతేగాక ఆన్లైన్ బెట్టింగ్ల కొరకు అప్పులు చేసి వాటిని తీర్చే అవకాశం లేక ఆత్మహత్యలకు పాల్పడుతున్న సంఘటనలు అనేకం జరుగుతున్నాయని ఆయన తెలిపారు. శక్తి యాప్ మహిళలు, బాలికల రక్షణకు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు ఆపదలో చిక్కుకున్న మహిళలు, బాలికలు శక్తి యాప్ను వినియోగించుకొని ప్రమాదం నుంచి బయటపడవచ్చు అని తెలిపారు. ఆ కార్యక్రమంలో అల్లినగరం గ్రామ సచివాలయ కార్యదర్శి పోతుగంటి దస్తగిరి ,గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## మనమిత్ర, శక్తి మొబైల్ యాప్ పై అవగాహన



**చంద్రశేఖరపురం, పెన్ పవర్ ఏప్రిల్ 22**

మహిళలు చిన్నారుల భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన మన మిత్ర, శక్తి యాప్ గురించి విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశాల మేరకు చంద్రశేఖరపురం మండలంలోని మండల అధికారులు, గ్రామ సచివాలయాల సిబ్బంది ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కోవిలంపాడు గ్రామ సచివాలయ సిబ్బంది సచివాలయ పరిధిలోని గృహాలను సందర్శించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు, చిన్నారుల భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం వినూత్నంగా రూపొందించిన శక్తి మొబైల్ యాప్ ను ప్రతి మహిళ యువత తన మొబైల్ ఫోన్ లో డౌన్లోడ్ చేసుకుని తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. శక్తి యాప్ ఆపద సమయాల్లో రక్షణగా ఉంటుందని, శక్తి యాప్లో బటన్ ను ప్రెస్ చేస్తే క్షణాల్లో మీ దగ్గర్లోని పోలీసులు మీ వద్దకు చేరుకుని సహాయం చేస్తారని తెలిపారు. శక్తి యాప్ డౌన్లోడ్ చేసుకోవడం చాలా అవసరం అత్యవసర సమయాల్లో ఇది మనకు రక్షణ కల్పిస్తుందని ప్రతి ఒక్కరూ ఈ యాప్ ను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛభారత్ చేసిన క్విస్ ఎన్ సీసీ విద్యార్థులు



**కార్పొరేషన్ పెన్ పవర్, ఒంగోలు ఏప్రిల్ 22**

ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ సీసీ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం ధరిత్రి దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎన్ సీసీ క్యాడెట్లు కళాశాల దగ్గర్లోని కొన్ని ప్రాంతాలను శుభ్రం చేశారు. చెత్తను ఏరేసి, మొక్కలను నాటారు. అనంతరం భూమిని, పర్యావరణాన్ని కాపాడాలని ప్రతిజ్ఞ చేసి, అందరికీ అవగామన కల్పించారు. ఈ సందర్భంగా ఎన్ సీసీ క్యాడెట్లను విద్యాసంస్థల అధినేత డాక్టర్ సూర్య కల్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ డాక్టర్ శ్రీ గాయత్రి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్ సీసీ ఇంఛార్జ్ డాక్టర్ వాసుబాబు, ఎన్ సీసీ ఇన్ స్ట్రక్టర్ రమణయ్య, క్యాడెట్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సై-టీబీ చర్మ పరీక్ష - మీ ఆరోగ్యం కోసం ఒక అవసరం



**పొన్నలూరు పెన్ పవర్ ఏప్రిల్ 22**

ప్రభుత్వం 2030 నాటికి టీబీ (క్షయరోగం) నిర్మూలన లక్ష్యంగా సై-టీబీ చర్మ పరీక్షను ప్రవేశపెట్టిందని ఇది ఒక సురక్షితమైన, ఖచ్చితమైన పరీక్ష విధానం అని ఆరోగ్య కేంద్ర అధికారి రవి కిరణ్ తెలిపారు. ఎవరెవరు పరీక్ష చేయించుకోవాలి అంటే టీబీ ఉన్నవారి ఇంటి సభ్యులు టీబీ వచ్చే ప్రమాదం ఉన్న వారు ( దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారు, 18 సంవత్సరాలు పైబడి ఆల్కహాల్, పొగత్రాగు వారు,60 సంవత్సరాలు పై బడినవారు వృద్ధులు) ఫ్రంట్‌లైన్ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ వారు పరీక్షలు చేసుకోవాలన్నారు. అసలు ఎందుకు ఈ పరీక్ష అవసరం ఈ పరీక్ష ద్వారా టీబీ ఇన్ఫెక్షన్(గుప్త క్షయ వ్యాధి)మన శరీరంలో ఉన్నదో,లేదో తెలుసుకోవచ్చని తద్వారా క్షయ వ్యాధి బారిన పడకుండా జాగ్రత్త పడవచ్చని అన్నారు. పరీక్ష ఎక్కడ చేయించుకోవచ్చు మీ దగ్గరలోని ఆరోగ్య కేంద్రం లేదా హెల్త్ క్యాంప్‌కి వెళ్లి పరీక్ష చేయించుకోవచ్చునని పరీక్ష కూడా ఉచితంగా చేస్తారని అన్నారు. మనం ముందుగానే జాగ్రత్త పడితే, టీబీను మన సమాజం నుంచి తొలగించవచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమం లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## పొదిలిలో ఘనంగా పురందేశ్వరి పుట్టినరోజు వేడుకలు



**పొదిలి, పెన్ పవర్, ఏప్రిల్ 22**

రాష్ట్ర బిజెపి అధ్యక్షురాలు, మాజీ కేంద్రమంత్రి దగ్గుబాటి పురందేశ్వరి పుట్టినరోజు వేడుకలు మంగళవారం నాడు పొదిలిలో ఘనంగా జరిగాయి పట్టణంలోని బెల్లంకొండ నగర్ లో గల మండల బిజెపి కార్యాలయంలో జిల్లా బిజెపి అధికార ప్రతినిధి బెల్లంకొండ విజయలక్ష్మి ఆధ్వర్యంలో వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు ఈ సందర్భంగా కార్యాలయంలో పురందేశ్వరి బర్త్ డే కేక్ ను కట్ చేసి అందరికీ పంచి పెట్టారు ఈ సందర్భంగా బెల్లంకొండ విజయలక్ష్మి మాట్లాడుతూ బీజేపీ అభివృద్ధికి పురందేశ్వరి చేస్తున్న కృషిని వివరించారు పురందేశ్వరి నాయకత్వంలో రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ మరింత బలమైన శక్తిగా రూపుదిద్దుకుంటుందని చెప్పారు ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కో కన్వీనర్ ఎస్ డి ఖాదర్ భాష, మండల బిజెపి అధ్యక్షులు డి రమణారెడ్డి, పట్టణ బిజెపి అధ్యక్షులు యుద్ధం మహేష్, మహబూబ్ బాషా, ఎస్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

## అల్లినగరం ప్రధానోపాధ్యాయులు దాసరి గురుస్వామిని సన్మానించిన ఉపవిద్యశాఖాధికారులు- ప్రధానోపాధ్యాయులు

### ఈ ఏడాది మే 31న ఉద్యోగ విరమణ చేయనున్న దాసరి గురుస్వామి.

### ముందస్తుగా సన్మానించి గురు స్వామి సేవలను కొనియాడిన మార్కాపురం ఒంగోలు ఉప విద్యాశాఖాధికారులు.



**కొమరోలు పెన్ పవర్ ఏప్రిల్ 22**

కొమరోలు మండలం అల్లినగరంలోని మునగనూరి వెంకటసుబ్బయ్య అండ్ సన్స్ జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు దాసరి గురు స్వామిని మార్కాపురం ఉప విద్యాశాఖ అధికారి సామ్యూల్ జాన్ ,ఒంగోలు ఉపవిద్య శాఖ అధికారి శాఖ చంద్రమౌళీశ్వర్ ఆధ్వర్యంలో మార్కాపురం డివిజన్లోని ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు మంగళవారం ఘనంగా సన్మానించి గురుస్వామి సేవలను కొనియాడారు. మంగళవారం మార్కాపురంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. దాసరి గురుస్వామి ఈ ఏడాది మే 31వ తేదీన ఉద్యోగ విరమణ చేయనున్నారు .ఆ సందర్భాన్ని పురస్కరించుకొని ముందస్తుగా ఆయనకు సన్మాన కార్యక్రమం నిర్వహించి గురు స్వామిని పూలమాల శాలువా జ్ఞాపకతో ఘనంగా సన్మానించారు. ఆ సందర్భంగా మార్కాపురం ఉప విద్యాశాఖ అధికారి సామ్యూల్ జాన్ మాట్లాడుతూ, గురు స్వామి అల్లినగరం హైస్కూలును అన్ని రంగాలలో తీర్చిదిద్దారని, ఆయన ఏ పాఠశాలలో ఏ పోస్టులో పనిచేసినా, అంకితభావంతో పనిచేస్తూ వచ్చారని, అందువలన ఆయనకు జిల్లాస్థాయిలో ఉత్తమ ప్రధానోపాధ్యాయ అవార్డు లభించిందని పేర్కొన్నారు .ఒంగోలు ఉప విద్య శాఖ అధికారి చంద్రమౌళీశ్వర మాట్లాడుతూ అల్లినగరంలోని హై స్కూల్ ప్రధానోపాధ్యాయులుగా బాధ్యతలు స్వీకరించిన మొదటి సంవత్సరంలోనే ఆ పాఠశాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేసి సమూల మార్పులు తెచ్చారని అన్నారు, దీనితో ఆ గ్రామంలోని పెద్దలు విద్యార్థుల తల్లిదండ్రులు గురుస్వామి సేవలను ప్రశంసిస్తున్నారని పేర్కొన్నారు. తాను అనేక పర్యాయాలు అల్లినగరం హై స్కూల్ ను సందర్శించారనని ,హైస్కూల్లో జరుగుతున్న విద్యాబోధన, హై స్కూలు వాతావరణం, ఉపాధ్యాయులు విద్యార్థులో కనిపించిన క్రమశిక్షణ, పాఠశాల ఆవరణ పచ్చదనంతో నిండి ఆహ్లాదకరంతో కనిపించిన వాతావరణం తనకు సంతృప్తిని కలిగించిందని, అంతేగాక టెన్త్ క్లాస్ పరీక్ష ఫలితాలలో ఉత్తమ ఫలితాలు సాధించడం కూడా తనకు ఎంతో సంతోషాన్ని కలిగించిందని అన్నారు .ఆ కార్యక్రమంలో మార్కాపురం, ఎర్రగొండ పాలెం, గిద్దలూరు, కనిగిరి నియోజకవర్గాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొని దాసరి గురుస్వామిని ఘనంగా సన్మానించారు. తనకు ముందస్తు సన్మాన కార్యక్రమం నిర్వహించి తనను ఘనంగా సన్మానించిన మార్కాపురం, ఒంగోలు ఉప విద్యాశాఖ అధికారులకు, ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులకు దాసరి గురుస్వామి ధన్యవాదాలు తెలిపారు.



## ఉత్తమ ఫలితాలు సాధించిన కేజీబీవీ విద్యార్థినులకు బహుమతులు అందజేసిన మానవతా సంస్థ




**పామూర, పెన్ పవర్, ఏప్రిల్22**

ప్రకాశం జిల్లాలోని కేజీబీవీ కేంద్రాలలో పామూరు కేజీబీవీ సీనియర్ ఇంటర్ విద్యార్థినిలు ఉత్తమ ఫలితాలు సాధించారు. ప్రథమ స్థానంలో నిలిచిన టి శ్రీదేవి (960)కి 4000 ద్వితీయ స్థానంలో నిలిచిన డి హేమశ్రీ (952)కి 3000 నగదు అందించి మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు వారిని అభినందించి బహుమతి అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మరియు ఎంపీసీ గ్రూప్ నందు 903 మార్కులు సాధించిన ఎం మాధురికి టి రమేష్ సంస్థ తరఫున 1000 అందజేశారు. ఈ కార్యక్రమంలో కల్లూరి రామిరెడ్డి, ఎం ముసలయ్య, కేజీబీవీ ప్రిన్సిపల్ కటకం సజన, టి వెంకటేశ్వరరావు, వి వెంకటేశ్వరరెడ్డి, పి తిరుపతిరెడ్డి, వై వెంకటసుబ్బయ్య, విద్యార్థినిలు వారి తల్లిదండ్రులు ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకం ఏపీఓగా మహాలక్ష్మి




**పొదిలి, పెన్ పవర్, ఏప్రిల్ 22**

జాతీయ మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం పొదిలి యూనిట్ అసిస్టెంట్ ప్రాజెక్టు ఆఫీసర్ గా వై మహాలక్ష్మి నియమితులయ్యారు ఈ మేరకు ఆమె మంగళవారం నాడు పొదిలిలో తన ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు కొండేపి యూనిట్ ఉపాధి హామీ పథకం ఏపీఓగా పనిచేస్తూ, బదిలీపై మహాలక్ష్మి పొదిలికి వచ్చారు ఈ సందర్భంగా మహాలక్ష్మి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద పనులను పారదర్శకంగా నిర్వహించడం జరుగుతుందన్నారు పనుల్లో ఎటువంటి అవకతవకులకు చోటు లేకుండా సమర్థవంతంగా నిర్వహిస్తామని చెప్పారు.

# యానాదుల సంక్షేమం కూటమి ప్రభుత్వం లక్ష్యం

**– మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి**



**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ ఏప్రిల్ 22**

యానాదుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. మంగళవారం నాడు ప్రకాశం జిల్లా తూర్పు నాయుడుపాలెంలోని క్యాంపు కార్యాలయంలో యానాది సంఘం ప్రతినిధులు మంత్రిని కలిసి యానాది కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, ప్రిమిటివ్ ట్రైబల్ జాబితాలో తమను చేర్చాలని కోరారు. జనాభా దామాషా ప్రాతిపదికన చట్టసభల్లో యానాది సామాజిక వర్గానికి ప్రాధాన్యతివ్వాలని కోరారు. ఈ మేరకు వారు మంత్రికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ.. యానాదుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని, యానాది సామాజిక వర్గానికి అన్ని విధాల ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. యానాదుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని మంత్రి తెలిపారు.

# పోస్టర్ ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్




**కార్పొరేషన్ పెన్ పవర్, ఒంగోలు ఏప్రిల్ 22**

కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) సామాజిక చైతన్య సాంస్కృతిక ఉత్సవాల్లో భాగంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జీవిత చిత్రం, కళారూపకం (నాటకం) ప్రదర్శన ప్రచార గోడ పత్రిక ను కలెక్టర్ ఆఫీస్ నందు మంగళవారం నాడు ప్రకాశం జిల్లాకలెక్టర్ తమీమ్ అన్సారియా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రఘురామ్ మాట్లాడుతూ కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) సామాజిక చైతన్య సాంస్కృతిక ఉత్సవాలు 2025 ఆధునిక రంగస్థలం అరుగు పైన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జీవిత చిత్రం, కళారూపకం (నాటకం) మే 8న ఒంగోలు అంబేద్కర్ భవనం కలెక్టర్ ఆఫీస్ ఎదురు, మే 9 మద్దిపాడు నటరాజ కళాక్షేత్రం పంచాయతీ ఆఫీస్ దగ్గర జరిగే నాటకాలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు వేసపోగు మోజేష్ జె. సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

# పొదిలిలోని వివాహ వేడుకల్లో పాల్గొన్న హనుమారెడ్డి



**పొదిలి, పెన్ పవర్, ఏప్రిల్ 22**

పొదిలిలో జరిగిన ఒక వివాహ వేడుకలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి వెన్న హనుమాన్ రెడ్డి పాల్గొన్నారు పొదిలికి చెందిన టి లక్ష్మీ నర్సారెడ్డి కుమార్తె వివాహం మంగళవారం నాడు అంగరంగ వైభవంగా జరిగింది వివాహ వేడుకల్లో పాల్గొన్న హనుమారెడ్డి వధూవరులను ఆశీర్వదించారు ఈ కార్యక్రమంలో హనుమాన్ రెడ్డి తో పాటు వైకాపా నాయకులు, మర్రిపూడి మండల పరిషత్ అధ్యక్షులు వాకా వెంకటరెడ్డి కూడా పాల్గొన్నారు.

# బిక్షువు ఆత్మహత్య

## వైద్యశాల పై నుంచి దూకి

**గిద్దలూరు పెన్ పవర్ ఏప్రిల్ 22**

గిద్దలూరు ప్రభుత్వ ఆసుపత్రి మొదటి అంతస్తు పై నుండి దూకి ఆత్మహత్య చేసుకున్న బిక్షువు సాయికుమార్(63) ఈ సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. మృతుడు సాధువుగా ఉంటూ గిద్దలూరు లో బిక్షాటన చేసుకునేవాడు. ఇతని స్వస్థలం బెంగళూరు అని తెలుస్తుంది ఈ సాధువుకు రెండు రోజుల క్రితం ఆటో తగిలిందని ఆసుపత్రిలో చేరాడు తనకు ఆరోగ్యం బాగలేదని ఆత్మహత్య చేసుకుంటానని తోటి రోగులతో చెప్పి ఆసుపత్రి పైనుండి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. గిద్దలూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# పొగాకు రైతులను ఆదుకుంటాం





**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ ఏప్రిల్ 22**

పొగాకు రైతులను అన్ని విధాల ఆదుకుంటామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి అన్నారు. మంగళవారం ఉదయం ఒంగోలులోని పొగాకు వేలం కేంద్రాన్ని మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, సంతనూతలపాడు శాసన సభ్యులు బి ఎన్ విజయకుమార్ తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా పొగాకు కొనుగోళ్ల గురించి బోర్డు అధికారులను అడిగి తెలుసుకున్నారు. కొనుగోళ్లలో ఎదురవుతున్న ఇబ్బందులు, ధరల గురించి రైతులు, రైతు సంఘ నాయకులతో మాట్లడారు. ఈ సందర్భంగా మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి విలేఖరులతో మాట్లాడుతూ, ఎక్కువగా నో బిడ్లు వస్తున్నాయని దీని వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కర్నాటకలో పొగాకు కొనుగోళ్లు ముగిశాయని ఈ నేపథ్యంలో ఇక్కడ కొనుగోళ్లను వేగవంతం చేయాలని అన్నారు. లో గ్రేడ్ ఎక్కువగా తిరస్కరణకు గురవుతున్నాయని ఈ విషయంలో రైతులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. నో బిడ్లు, ధరల గురించి కొనుగోలుదారులతో ఒక సమావేశం ఏర్పాటు చేసి తగు నిర్ణయం తీసుకుంటామన్నారు. గతంలో కూడా ధరలు లేని పరిస్థితుల్లో తమ ప్రభుత్వం రైతులకు అండగా నిలబడిందన్నారు. ఇప్పుడు కూడా రైతుల నష్టపోకుండా అన్ని విధాల ఆదుకుంటామన్నారు.

# రగ్బీ నేషనల్ క్రీడలకు ఎంపికైన పాండు నాయక్

## రూ. 25 వేలు ఆర్థిక సహాయం అందించిన గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల



**గిద్దలూరు పెన్ పవర్ ఏప్రిల్ 22**

అస్సాం రాష్ట్రంలోని డిస్పూర్ పట్టణంలో ఈనెల 25 వ తేదీ నుండి 30 వరకు జరగనున్న రగ్బీ నేషనల్స్ క్రీడలకు ప్రకాశం జిల్లా నుండి ఎంపికైన గిద్దలూరు మండలం, వెల్లుపల్లె గ్రామానికి చెందిన జరుబుల రమణ నాయక్ కుమారుడు పాండు రంగ నాయక్ మంగళవారం ఉదయం గిద్దలూరు శాసన సభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్ రెడ్డి క్రీడలకు ఎంపికైన యువకుడిని అభినందించి భవిష్యత్తులో క్రీడల్లో రాణించేందుకు తన వంతు సహకారం ఉంటుందన్నారు. అస్సాం రాష్ట్రంలో జరిగే క్రీడల్లో పాల్గొనేందుకు ప్రోత్సాహకంగా రూ. 25 వేల ఆర్థిక సహాయం అందచేశారు. వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని క్రీడల్లో ప్రతిభ కనపరచి, గ్రామానికి, నియోజకవర్గానికి రాష్ట్రానికి మంచి గుర్తింపు తీసుకొని రావాలని యువకునికి అభినందనలు శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో వెల్లుపల్లె గ్రామ నాయకులు బద్రి గోపాల్ రెడ్డి, కంకర వెంకట రెడ్డి, కంకర రామశంకర్ రెడ్డి, సుగాలి వెంకటేశ్వర నాయక్, దొంతర రామయ్య, తిరుపతయ్య, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

# పుట్టెడు కష్టాలతో అల్లాడుతున్న కుటుంబానికి ఆర్థిక సహాయం చేసిన అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు యాదవ్.

### పక్షవాతానికి గురై అల్లాడుతున్న కొమరోలు మండలం కంకర వాణి పల్లి గ్రామానికి చెందిన మట్టి మల్ల కాశయ్య భార్య సుజాత. తాపీ మేస్త్రీగా పని చేస్తూ ప్రమాదవశాత్తు కాళ్లు కోల్పోయిన కాశయ్య

**కొమరోలు పెన్ పవర్ ఏప్రిల్ 22.**

పక్షవాతానికి గురై మంచానికి పరిమితమైన ఇల్లాలు సుజాత, తాపీ మేస్త్రి గా పనిచేస్తూ ప్రమాదవశాత్తు జారిపడి కాళ్లు కోల్పోయిన భర్త కాశయ్య. తల్లిదండ్రులు ఇద్దరు అనారోగ్యాలపాలు కావడంతో వారి కుమారులు చదువుకొనే స్తోమత లేక, కుటుంబ పోషణ జరగక ఆపన్న హస్తాల కోసం ఎదురుచూస్తున్న ఆవేదన హరితమైన సంఘటన కొమరోలు మండలం కంకర వానిపల్లెలో చోటు చేసుకున్నది. ఆ గ్రామానికి చెందిన మట్టి మల్ల కాశయ్య తాపీ మేస్త్రి గా హైదరాబాదులో పనులు చేస్తూ భార్యను ఇద్దరు కుమారులను పోషించుకునేవాడు .అయితే భార్యకు ఆకస్మికంగా నరాల బలహీనత ఏర్పడి పక్షవాత వ్యాధికి లోనై మంచానికి పరిమితమై జీవిస్తున్నది. ఇక కాశయ్య హైదరాబాదులో తాపీ మేస్త్రిగా పనిచేస్తుండగా, ప్రమాదవశాత్తు భవనం పైనుంచి జారిపడంతో అతని రెండు కాళ్లకు తీవ్ర గాయాలు శాస్త్ర చికిత్సలు జరిగాయి. దీనితో భార్యాభర్తలు స్వగ్రామమైన కంకరవాని పల్లెకు చేరుకున్నారు. కుటుంబ పోషణ జరగక ,ఇద్దరు కుమారులను చదివించుకునే స్తోమత లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నట్లుగా సమాచారం అందుకున్న అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు, కొమరోలు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు యాదవ్ మంగళవారం కంకర వాణి పల్లెకు వెళ్లి మట్టి మల్లె కాశయ్య, సుజాతలకు 10,000 రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు ఆ మేరకు కాశయ్య సుజాతలు వెంకటేశ్వర్లు యాదవ్ కు ధన్యవాదాలు తెలిపారు. ఆ కార్యక్రమంలో అమ్మ ఫౌండేషన్ కార్యదర్శి పందన బోయిన భూపాల్ యాదవ్ మల్లికార్జున రెడ్డి, నారాయణ ,బాల వెంకట్ రెడ్డి, కృష్ణ ,కాశీ రావు ,నరసింహ, బాలసుబ్బయ్య, సుబ్బరాయుడు, పీరయ్య తదితరులు పాల్గొన్నారు.




# పొదిలి ఏఎంసి చైర్మన్ డాక్టర్ ఇమాంస ను కలసిన గౌస్ భాష

**పొదిలి, పెన్ పవర్, ఏప్రిల్ 22**

పొదిలి మార్కెటింగ్ కమిటీ చైర్మన్ గా ఎన్నికైన డాక్టర్ సయ్యద్ ఇమాంస ను జిల్లా టిఎన్ఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి షేక్ గౌస్ బాషా కలిశారు మంగళవారం నాడు స్థానిక ఇమాంస క్లినిక్ లో ఆయనను కలసిన గౌస్ బాషా ముందుగా శాలువా తో సత్క రించి, తన శుభాకాంక్షలు తెలియజేశారు ఇమాంస భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించి తద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని గౌస్ బాషా తదితరులు ఆకాంక్షించారు.



# పొదిలి ఏఎంసీ చైర్మన్ ఇమాంసను కలసిన దేశం నాయకులు




**పొదిలి, పెన్ పవర్, ఏప్రిల్ 22**

పొదిలి మార్కెటింగ్ కమిటీ చైర్మన్ గా ఎన్నికైన డాక్టర్ సయ్యద్ ఇమాంసను మంగళవారం నాడు పలువురు దేశం నాయకులు కలిశారు ఈ సందర్భంగా ఇమాంస ను శాలువా, పూలదండలతో సత్కరించి తమ శుభాకాంక్షలు తెలియజేశారు భవిష్యత్తులో డాక్టర్ ఇమాంస మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించి, తద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని వారు ఆకాంక్షించారు కలసి శుభాకాంక్షలు తెలియజేసిన వారిలో తెలుగుదేశం నాయకులు వీరిశెట్టి సురేష్, రోళ్ళా శ్రీను, వెలుగోలు వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

# వ్యవసాయ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం







**చంద్రశేఖరపురం, పెన్ పవర్ ఏప్రిల్ 22**

కదిరి బాబురావు వ్యవసాయ కళాశాలలో నాలుగవ సంవత్సరం చదువుతున్న విద్యార్థుల ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరం కార్యక్రమంలో భాగంగా రెండోవ రోజు మంగళవారం శీలంవారిపల్లె గ్రామంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు గ్రామంలోని రహదారుల వెంబడి పిచ్చి మొక్కలు తొలగించి, రోడ్లను,మురుగునీరు కాలువలను శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ చల్లారు.అనంతరం గ్రామస్థులతో మాట్లాడుతూ గ్రామంలోని మురుగు నీరు కాలువలు లేకుండా చూడాలని మి ఇంటి పరిసరాలను పరిశుభ్రతంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం యన్ ఎస్ ఎస్ ప్రోగ్రామ్ ఇన్చార్జ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ పి.శ్రీవిద్యా ఆధ్వర్యంలో నిర్వహించారు.

# ఎన్విరాన్ మెంటల్ సిటీగా అమరావతి

**విజయవాడ, ఏప్రిల్ 22, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి ముందు అద్భుత అవకాశం ఊరిస్తోంది. రాజధాని అమరావతిని ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భావిస్తోంది. ఈ క్రమంలోనే అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో అమరావతిని నిర్మించే పనిలో ఉంది. అందులో భాగంగానే అమరావతిలో స్పోర్ట్స్ సిటీ, అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం, అమరావతి ఎయిర్‌పోర్టు, అమరావతి రైల్వే లైన్.. ఇలా ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు చేపడుతోంది. అలాగే ప్రపంచంలోనే పూర్తిగా పునరుత్పాదక శక్తితో నడిచే మొదటి నగరంగా అమరావతిని నిలిపేలా ప్రభుత్వం, అధికారులు పనిచేస్తున్నారు. అమరావతిని గ్రీన్‌ఫీల్డ్ నగరంగా అభివృద్ధి చేస్తున్న అధికారులు.. అమరావతి రాజధాని అవసరాల కోసం సౌర, పవన, జలవిద్యుత్ వనరుల నుంచి 2,700 మెగావాట్ల క్లీన్ ఎనర్జీని ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.మరోవైపు అమరావతి పునఃప్రారంభానికి ప్రధాని నరేంద్ర మోదీ హాజరుకానున్న సంగతి తెలిసిందే. మే 2వ తేదీన ప్రధాని మోదీ చేతుల మీదుగా అమరావతి రీలాంఛింగ్ కార్యక్రమం జరగనుంది. మొత్తం 65 వేలకోట్ల అంచనా వ్యయంతో అమరావతి నిర్మాణాన్ని చేపడుతున్నారు. 217 చదరపు కిలోమీటర్ల పరిధిలో కృష్ణా నదీతీరంలో అమరావతి కొలువు దీరనుంది. విజయవాడ, గుంటూరు నగరాల మధ్య పర్యావరణహిత రాజధానిగా అమరావతిని తీర్చిదిద్దనున్నారు. పూర్తిగా గ్రీన్ ఎనర్జీ వినియోగం ద్వారా అమరావతిని ప్రపంచానికి ఓ రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దాలని అధికారులు భావిస్తున్నారు. ఇందుకోసం 2,700 మెగావాట్ల విద్యుత్‌ను సౌర, పవన, జలవిద్యుత్ ద్వారా ఉత్పత్తి చేయనున్నారు.పునరుత్పాదక శక్తి వనరుల వినియోగం ద్వారా శిలాజ ఇంధనాల అవసరాన్ని తొలగించాలని.. పర్యావరణహిత నగరంగా అమరావతిని తీర్చిదిద్దాలని అధికారుల ఆలోచన. మరోవైపు 2050 నాటికి అమరావతికి 2.7 గిగావాట్ల విద్యుత్ అవసరమవుతుందని అధికారుల అంచనా. ఇందులో కనీసం 30 శాతాన్ని సోలార్, విండ్ పవర్ ద్వారా ఉత్పత్తి చేయాలని ప్రణాళికలు రచిస్తున్నారు. ఇందుకోసం రూఫ్ టాప్ సోలార్ వ్యవస్థలను తప్పనిసరి చేయాలనే ఆలోచన ఉంది. ప్రభుత్వ హౌసింగ్ ప్రాజెక్టులలో కనీసం మూడో వంతు వాటికి ఈ రూఫ్ టాప్ సోలార్ సిస్టమ్స్ ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు.అలాగే అమరావతి ప్రజా రవాణా వ్యవస్థలో కూడా రెన్యువబుల్ ఎనర్జీ వినియోగించాలని ఆలోచిస్తున్నారు. మెట్రో, ఎలక్ట్రిక్ బస్సులను



రెన్యువబుల్ ఎనర్జీతోనే నడిపించాలని ప్రణాళికలు రూపొందిస్తున్నారు. పార్కులు, బస్ స్టాపులు, నడకదారుల్లో సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేయడం ద్వారా సౌర విద్యుత్ ఉత్పత్తి చేయాలని ఆలోచిస్తున్నారు. మొత్తంగా పూర్తి స్థాయిలో పునరుత్పాదక శక్తితో నడిచే మొదటి నగరంగా అమరావతిని తీర్చి దిద్దాలని అధికారులు ప్రయత్నిస్తున్నారు.


**మరో కొత్త రైల్వే లైన్**

కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఏపీలో మౌలిక వసతుల ప్రాజెక్టుల నిర్మాణంలో వేగం పెరిగింది. ఇప్పటికే పలు జాతీయ రహదారుల విస్తరణ పనులు జోరందుకున్నాయి. అలాగే కొత్త రహదారి ప్రాజెక్టులు, నూతన రైల్వే లైన్లకు కూడా కేంద్రం నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చింది. ఇక ఏళ్ల తరబడి స్తబ్దుగా ఉన్న రైల్వే ప్రాజెక్టు పనుల్లో కూడా కదలిక వచ్చింది. ఈ క్రమంలోనే కోటిపల్లి - నరసాపురం రైల్వే లైన్ నిర్మాణ పనుల్లో కదలిక వచ్చింది. కోటిపల్లి - నరసాపురం రైల్వే లైన్ ఆ ప్రాంతవాసుల 60 ఏళ్ల కల. ఇటీవల రాష్ట్ర ఎంపీలు కూడా కోటిపల్లి-నర్సాపురం రైల్వే లైన్ పనులు వేగవంతం చేయాలని కేంద్రాన్ని కోరారు. ఈ క్రమంలోనే కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ కోటిపల్లి - నరసాపురం రైల్వే లైన్ పనుల గురించి అప్ డేట్ ఇచ్చారు.కోటిపల్లి- నరసాపురం రైల్వే లైన్ నిర్మాణానికి అయ్యే ఖర్చును పూర్తి కేంద్రమే భరించేలా ఆలోచన చేస్తున్నట్లు కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ తెలిపారు. కొంతమంది రైతులు కోర్టుకు వెళ్లటంతోనే కోటిపల్లి నరసాపురం రైల్వే లైన్ అలైన్‌మెంట్ పనులలో జాప్యం జరుగుతున్నట్లు ఆయన తెలిపారు. అన్ని సమస్యలను పరిష్కరించి రైల్వేలైన్ నిర్మాణ పనులు వేగవంతం చేస్తామన్నారు.

కోటిపల్లి - నరసాపురం రైల్వే లైన్ నిర్మాణానికి 2001లో కేంద్రం ఆమోదించింది. రూ.1,045.20 కోట్లతో నిర్మాణం చేపట్టేందుకు 2001 డిసెంబర్‌లో ఆమోదం తెలిపింది. 2009 నాటికల్లా ఈ రైల్వే లైన్ నిర్మాణం పూర్తికావాల్సి ఉంది. అయితే వివిధ కారణాలతో ఈ ప్రాజెక్టు ముందుకు కదలడం లేదుమరోవైపు కోటిపల్లి నరసాపురం రైల్వే లైన్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం భూమిని కేటాయించాల్సి ఉందని 2024 ఆగస్టులో రైల్వేశాఖ తెలిపింది. 57.21 కిలోమీటర్ల ఈ లైన్ నిర్మాణానికి 416.79 హెక్టార్ల భూమి అవసరమని.. ఈ భూమిని రాష్ట్ర ప్రభుత్వం అప్పగించాల్సి ఉందని పేర్కొంది. కోటిపల్లి-నరసాపురం రైల్వే లైన్.. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలను కలిపే ముఖ్యమైన రైల్వే ప్రాజెక్టు. ఈ ప్రాజెక్టులో భాగంగా గోదావరి నదిపై మూడు ప్రధాన వంతెనలు నిర్మించాల్సి ఉంటుంది. అయితే అలైన్‌మెంట్ ఖరారు. భూ కేటాయింపుల కారణంగా కోటిపల్లి నరసాపురం రైల్వేలైన్ నిర్మాణంలో జాప్యం జరుగుతోంది. అయితే కేంద్ర మంత్రి తాజా ప్రకటనతో ఈ ప్రాజెక్టు పనుల్లో వేగం పెరుగుతుందేమో చూడాలి.

# అమ్మకానికి విశాఖ

**విశాఖపట్టణం, ఏప్రిల్ 22, పెన్ పవర్:** విశాఖ భూములంటే బంగారం. గోల్డ్ కంటే ఎంతో విలువైనవి. ఎందుకంటే విశాఖ అంటే నగరం కాదు.. అన్ని రాష్ట్రాల సంస్కృతలకు నిలయమైన సిటీ. ఇప్పుడే కాదు విశాఖలో 1990వ దశకం అంటే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోనూ విశాఖలో కాస్ట్ ఆఫ్ లివింగ్ ఎక్కువగా ఉండేది. అక్కడ కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన సంస్థలతో పాటు నేవీ, సముద్ర తీర ప్రాంతం ఉండటంతో పర్యాటకుల సంఖ్య కూడా ఎక్కువగా ఉండటంతో ఉత్తరాంధ్రలో ఉన్న విశాఖపై ఏపీ వాసుల కన్ను పడింది అనేక మంది అక్కడకు వెళ్లి సెటలయి కోట్ల రూపాయలను ఆర్జించారు. మత్స్యకారులతో పాటు ఉత్తరాంధ్ర ప్రజలు అమాయకులు కావడంతో వారిని సులువుగా తమ బుట్టలో వేసుకోవడం సాధ్యమయిందని ఎవరైనా ఒప్పుకుంటారు. కోస్తాంధ్ర, రాయలసీమ నుంచి వెళ్లిన తర్వాతే విశాఖలో ఒకరకమైన వాతావరణం నెలకొందన్న వాదనలో నిజం లేకపోలేదు.. అయితే ఇప్పుడు ఈ సోది అంతా ఎందుకంటే.. కొన్ని దశాబ్దాలుగా విశాఖ నగరం విస్తరించింది. ఇప్పటికే విశాఖ, విజయనగరం దాదాపు కలసిపోయింది. ఇటువంటి పరిస్థితుల్లో ఆంధ్రప్రదేశ్ కాబినెట్ కారు చౌకగా ఒక ఊరు పేరు తెలియని సంస్థకు 59 రూపాయలకే అరవై ఎకరాల వరకూ కట్టబెట్టడం చర్చనీయాంశమైంది. ది వైర్ పరిశోధాత్మక కథనంలోనూ అనేక ఆసక్తికరమైన విషయాలు వెలుగు చూశాయి. సాఫ్ట్ వేర్ కంపెనీ అని చెప్పుకునే ఉర్సు కంపెనీ 2025లోనే రిజిస్టర్ అయిందని తెలిసి అందరూ అవాక్కవుతున్నారు. దీనిపై విశాఖలోనూ వ్యతిరేకత వ్యక్తమవుతుంది. సాఫ్ట్ వేర్ కంపెనీలను స్థాపించుకోవడానికి ప్రభుత్వం ప్రోత్సాహకాలు ఇవ్వవచ్చు. అంతే తప్ప ఏకంగా భూములను కట్టబెట్టడమేంటన్న ప్రశ్న తలెత్తుంది. నిజానికి ప్రభుత్వమే హైటెక్ సిటీ లేదా మైండ్ స్పేస్ వంటి నిర్మాణాలు చేపట్టి నామమాత్రపు అద్దెకు లీజుకు ఇచ్చి ప్రోత్సహించవచ్చు. అంతే తప్పించి ఇలా భూములను విక్రయించుకుంటూ పోతే ఎలా అన్న ప్రశ్నకు మాత్రం ఎవరు సమాధానం చెప్పలేని పరిస్థితి. అసలు ఉర్సా అనే కంపెనీ పుట్టుకను వింటనే ఆశ్చర్యమేస్తుంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో రిజిస్టర్ అయిన కంపెనీ ఎన్ని వేల కోట్ల పెట్టుబడులు పెడుతుంది? అదేమైనా



కార్పొరేట్ కంపెనీయా అంటే అదీ కాకపోయె. ఉర్సా అనే పేరు కూడా వినని కంపెనీకి కాపులుప్పలపాడులో 56 ఎకరాలు, టీసీఎస్ కు ఇచ్చిన చోట3.6 ఎకరాలు కేటాయించింది. ఉర్సా క్లస్టర్ కంపెనీకి అప్పనంగా భూముల కేటాయించడంపై ఇప్పటికే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కేవలం ఇద్దరు డైరెక్టర్లతో ప్రారంభమైన ఈ కంపెనీ కేవలం పది లక్షల రూపాయల పెట్టుబడితో ప్రారంభమైందని ది వైర్ ఇన్విస్టిగేషన్ లో వెల్లడయింది. అంతేకాదు ఇందులో ఇద్దరు డైరెక్టర్లు సతీష్ అబ్బూరి, కౌశిక్ పెందుర్తి అమెరికాలో ఒక సాఫ్ట్ వేర్ కంపెనీలో పనిచేస్తూ వారు ఇక్కడ ఐటీ పరిశ్రమను నెలకొల్పేందుకు ముందుకు వచ్చారని ది వైర్ కథనం వెల్లడించింది.. కంపెనీ పేరుతో ఇప్పటి వరకూ హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ లో ఒక్క కార్యాలయం కూడా లేదని తెలిసింది. కేవలం ఏదో ఒక ఇంటి అడ్రస్ ఇచ్చి భూములను కారు చౌకగా కొట్టేశారంటున్నారు. కనీసం కంపెనీకి ఫోన్ నెంబరు కూడా లేకపోవడం అనేక అనుమానాలకు తావిస్తుంది. కనీం ఇంటి అడ్రస్ కూడా లేకపోవడం సందేహాలకు కారణంగా మారింది. రెసిడెన్షియల్ ఫ్లాట్ అడ్రస్ పెట్టి స్థలాలను విశాఖలో తీసుకునేందుకు ప్లాన్ చేశారని ది వైర్ కథనం ప్రచురించింది. ఈ కంపెనీ వయసు కేవలం రెండు నెలలు మాత్రమే. ఏపీ, తెలంగాణలలో ఇప్పటి వరకూ ఎలాంటి ఐటీ కార్యకలాపాలు నిర్వహించిన దాఖలాలు లేవని తేలింది. అయితే ఇదేకంపెనీ తెలంగాణ ప్రభుత్వంతోనూ ఐదు వేల కోట్ల రూపాయలతో ఒప్పందం చేసుకోవడం కూడా చర్చనీయాంశమైంది. ఉర్సా కంపెనీకి ఏపీ ప్రభుత్వం ఇచ్చిన భూమి విలువ వెయ్యికోట్లకుపైగానే ఉంటుందనిచెబుతున్నారు.ఇదే సమయంలో 2,500 మందికి మాత్రమే ఉపాధిఅవకాశాలు ఇవ్వనుందని కూడా ప్రభుత్వం చెబుతుంది.

# సీమనేతలను కట్టడి చేయడం ఎలా

**అనంతపురం, ఏప్రిల్ 22, పెన్ పవర్:** రాయలసీమ నేతలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కంట్రోల్ చేయాల్సి ఉంది. రాయలసీమలో గత ఎన్నికల్లో కూటమి ఘన విజయం సాధించింది. వైసీపీ అధినేత జగన్ కు పట్టున్న ప్రాంతమైన రాయలసీమలోనే ఆయనను దెబ్బకొట్టగలిగామన్న సంతృప్తి కూటమి పార్టీల అగ్రనేతల్లో ఎక్కువ సమయం మిగిలేట్లు కనిపించడం లేదు. రాయలసీమలో వచ్చే ఎన్నికల్లోనూ మంచి మెజారిటీ సాధించాలన్నా, జగన్ ను కట్టడి చేయాలన్నా చంద్రబాబు నాయుడు అక్కడి నేతలను కొందరిని కంట్రోల్‌లో చేయాల్సి ఉంటుంది. లేకపోతే పెద్దయెత్తున పార్టీ డ్యామేజీ అయ్యే అవకాశాలున్నాయి. రాయలసీమలో నేతలు తమ అడ్డాగా భావించి గిరిగీసుకుని మరీ తమ ప్రపంచంలోకి ఎవరూ రాకూడదని ఆంక్షలు విధిస్తున్నారు... నిన్నగాక మొన్న బీజేపీకి చెందిన జమ్మలమడుగుకు చెందిన ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి అనుచరులు అల్ట్రాటెక్ కంపెనీ నుంచి లారీలను వెళ్లకుండా అడ్డుకున్నారు. ఈ కంపెనీలో ఏ కాంట్రాక్టు పనైనా తమకే అప్పగించాలన్న షరతును ఆది పెట్టారు. లారీలను అడ్డుకోవడంతో కంపెనీ ప్రొడక్షన్ పై ప్రభావం పడింది. దీంతో జిల్లా కలెక్టర్ సీరియస్ అయి ఆదినారాయణరెడ్డి అనుచరులు పదకొండు మంది పై కేసులు నమోదు చేయించారు. గతంలోనూ ఫ్లై యాష్ వివాదంలో ఆదినారాయణరెడ్డి, తాడిపత్రిమున్సిపల్ ఛైర్మన్ జేసీప్రభాకర్ రెడ్డిల మధ్య వివాదం ముదిరింది. ఇద్దరూ తమకే కావాలంటూ పట్టుబట్టడం చంద్రబాబుకు తలనొప్పిగా మారింది. ఈ వివాదం కూడా పార్టీకి చెడ్డపేరు తెచ్చేలా ఉంది.ఆరు లక్షల ఓటు బ్యాంకుకు? తిప్పనివ్వనంటూ... తాజాగా జేసీ ప్రభాకర్ రెడ్డి మరొక అడుగు ముందుకు వేసి ప్రయివేటు బస్సుల యజమానులకు వార్నింగ్ ఇచ్చారు.. హైదరాబాద్ లో జరిగిన ప్రయివేటు బస్సు ఓనర్ల సమావేశానికి తనను పిలవకపోవడంపై జేసీ ప్రభాకర్ రెడ్డి గుర్రుగా ఉన్నారు. తనను ఆహ్వానించకుండా బస్సు ఓనర్లు సమావేశం ఎలా నిర్వహిస్తారంటూ ప్రశ్నించారు. తాను కూడా ప్రయివేటు బస్సు ఓనరేనని గుర్తులేదా? అంటూ జేసీ ప్రభాకర్ రెడ్డి నిలదీశారు. ప్రభుత్వానికి బస్సులు లీజు కు ఇస్తే అనంతపురంలో ఎలా నడుపుతారో చూస్తానంటూ బహిరంగంగా వార్నింగ్ ఇచ్చారు. తమ ఇలాకాలో లీజుకు ఇచ్చిన ప్రయివేటు బస్సులు తిరగడానికి లేదంటూ ఆంక్షలు విధించారు. తాను ఎప్పటి నుంచో ప్రయివేటు బస్సులను నడుపుతున్నానని, సమావేశానికి తనను పిలవకపోయినా పరవాలేదు కానీ, ఎవరెవరో తమకు ఇష్టం వచ్చినట్లు బస్సులు తిప్పుదామంటే ఊరుకునేది లేదని జేసీ ప్రభాకర్ రెడ్డి హెచ్చరించారు.

## ఏపీ రాజ్యసభ నుంచి అన్నామలై..?

**విజయవాడ, ఏప్రిల్ 22, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ లో విజయసాయిరెడ్డి రాజీనామాతో ఖాళీ అయిన ఏపీ రాజ్యసభ సీటు ఎన్నిక ప్రక్రియ ప్రారంభమయింది. ఎన్నికల సంఘం ఇప్పటికే షెడ్యూల్ విడుదల చేసింది. నామినేషన్ల దాఖలుకు నెలాఖరు వరకు గడువు ఉంది. ఈ సీటు కూటమి గెల్చుకోవడం ఖాయం. ఎందుకంటే వైసీపీకి పోటీ చేసే బలం కూడా లేదు. అయితే ఈ సీటును కూటమిలో ఓ పార్టీ తీసుకుంటుందన్నది ఆసక్తికరంగా మారింది. విజయసాయిరెడ్డి బీజేపీ ప్రోద్భలంతోనే రాజీనామా చేశారన్న ప్రచారం ఉంది. అందుకే ఆ సీటును వారికే కేటాయిస్తారని అంటున్నారు. టీడీపీ, జనసేనల్లో ఈ సీటుపై చర్చ లేదు. బీజేపీలోనే అభ్యర్థి ఎవరు అన్న చర్చ జరుగుతోంది. ఇంతకు ముందు కిరణ్ కుమార్ రెడ్డి పేరు ప్రముఖంగా వినిపించినా ఇప్పుడు అన్నామలై పేరు ముందుకు వచ్చింది. తమిళనాడులో రాజ్యసభ సీటు గెలుచుకునేంత బలం బీజేపీకి లేదు. అన్నాడీఎంకేతో పొత్తు కోసం అన్నామలైను ఉన్న పళంగా తమిళనాడు బీజేపీ చీఫ్ పదవి నుంచి తప్పించారు. పార్టీ కోసం కష్టపడిన వారికి అన్యాయం జరగదన్న సంకేతం పంపాలంటే.. ఇప్పుడు ఆయనకు పదవి ఇవ్వాలి. అందుకే అన్నామలై పేరును ప్రచారంలోకి తెచ్చారని భావిస్తున్నారు. ఏపీ నుంచి రాజ్యసభకు వెళ్తున్న వారిలో ఇతర రాష్ట్రాల వారే ఎక్కువగా ఉంటున్నారు. తెలంగాణ ఉద్యమ నేత ఆర్.కృష్ణయ్య ఏపీ నుంచి రాజ్యసభకు ఎంపికయ్యారు. గతంలో తమ పార్టీలో ఎవరూ లేనట్లుగా ఆర్ కృష్ణయ్యకు వైసీపీ రాజ్యసభ సీటు ఇచ్చింది. ఆయన తర్వాత వైసీపీకి రాజీనామా చేసి..బీజేపీలో చేరి మళ్లీ బీజేపీ నుంచి ఎన్నికయ్యారు. గుజరాత్ కు చెందిన పరిమళ్ నత్వానీ కూడా ఏపీ నుంచి రాజ్యసభకు ఎంపికయ్యారు. తెలంగాణకు చెందిన ప్రముఖ లాయర్ నిరంజన్ రెడ్డికి కూడా వైసీపీ రాజ్యసభ సభ్యత్వం ఇచ్చింది. ఇప్పుడు ఇతర రాష్ట్రం నుంచి కూటమి ప్రభుత్వం మరో నేతను రాజ్యసభకు పంపితే .. ఏపీకి సంబంధం లేని నాలుగో ఎంపీ.. ఏపీ నుంచి రాజ్యసభకు వెళ్లినట్లవుతుంది. ఏపీకి రాజ్యసభలో మొత్తం పదకొండు మంది సభ్యులు ఉన్నారు. వీరిలో నలుగురు ఇతర రాష్ట్రాలకు చెందిన వారు అవుతారు. ఇలాంటి పరిస్థితి ఇతర రాష్ట్రాల్లో అయితే సెంటిమెంట్ గా భావిస్తారు. తమ రాష్ట్ర ప్రజలు ఓట్లు వేసి..ఎమ్మెల్యేలుగా గెలిపిస్తే ఇతర రాష్ట్రాల వారిని ఇక్కడి నుంచి రాజ్యసభకు పంపించడం ఏమిటన్న ప్రశ్న ఇతర రాష్ట్రాల వాళ్లు వేస్తారు. దాన్నో సెంటిమెంట్ గా భావిస్తారు. ఇలాంటి విమర్శలే ఇప్పుడు ఏపీ ప్రజల నుంచి ఇతర రాష్ట్రాల వారిని రాజ్యసభకు పంపితే వచ్చే అవకాశం ఉంది.

## లక్ష కోట్ల పనులకు మోడీ శంకుస్థాపనలు



**అమరావతి, ఏప్రిల్ 22, పెన్ పవర్:** ఏపీ రాజధాని అమరావతిలో ప్రధాని మోదీ లక్ష కోట్ల విలువైన పనులకు శంకుస్థాపన చేస్తారని ఏపీ క్యాబినెట్ సబ్ కమిటీ తెలిపింది. మే 2న ప్రధాని మోదీ అమరావతి పర్యటనపై క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశమైంది. ప్రధాని పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లతో పాటు జన సమీకరణ, ట్రాఫిక్ కంట్రోల్, ప్రజలకు కల్పించాల్సిన ఇతర ఏర్పాట్లపై మంత్రి వర్గ ఉప సంఘంలో చర్చించారు.ఇప్పటికే ఏర్పాట్లకు సంబంధించి అధికారులకు వేర్వేరుగా బాధ్యతలు అప్పగించినట్లు మంత్రి నారాయణ తెలిపారు. ప్రధాని పాల్గొనే అన్ని కార్యక్రమాల గురించి చర్చించామన్నారు. ప్రధాని మోదీ అమరావతిలో లక్ష కోట్ల విలువైన పనులకు శంకుస్థాపన చేస్తారని, ఆ తర్వాత పనులు శరవేగంగా జరుగుతాయని మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు."ప్రధాని మోదీ వచ్చే నెల 2న మధ్యాహ్నం 3 గంటలకు అమరావతికి వస్తారు. సాయంత్రం 5 గంటల వరకు కార్యక్రమం ఉంటుంది. జన సమీకరణపై చర్చ జరిగింది. ట్రాఫిక్ కంట్రోల్ పై సీఆర్డీఏ, నేషనల్ హైవేస్ తో చర్చ జరిగింది. అధికారులకు వర్క్ ఎలాట్ మెంట్ జరిగింది. 5లక్షల మంది జనం వస్తారని అంచనా" అని మంత్రి నారాయణ తెలిపారు.కోసం రైతులు భూమి ఇచ్చారు. వారికి ధన్యవాదాలు తెలిపే వేదికగా మోదీ సభ ఉంటుంది. వివిధ నియోజకవర్గాల నుంచి నేతలు, క్యాడర్ సామాన్య జనం హాజరవుతారు" అని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు."లక్ష కోట్ల రూపాయల ప్రాజెక్ట్స్ కు ప్రధాని ప్రారంభోత్సవం చేస్తారు. రాష్ట్ర ప్రభుత్వ కీలక ప్రాజెక్ట్ లో అమరావతి ఒకటి. రేపటి ప్రధాని టూర్ లో అందరూ పాల్గొని విజయవంతం చెయ్యాలి. అన్ని ప్రాంతాల నుంచి ప్రతినిధులు వస్తారు" అని మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు.

## పిఠాపురంలో వెలివివాదం

**కాకినాడ, ఏప్రిల్ 22, పెన్ పవర్:** దళితులపై దారుణాలు ఉత్తరాదిలో ఇంకా అక్కడక్కడ కనపడుతుంటాయి. కానీ తెలుగు రాష్ట్రాల్లో ఇలాంటి సంఘటనలు అరుదు. అయితే ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో ఇలాంటి ఘటన జరగడం సంచలనంగా మారింది. అయితే నిజానిజాలు నిగ్గు తేల్చేందుకు అధికారులు రంగంలోకి దిగారు. దళితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పిఠాపురంలోని మల్లం అనే గ్రామానికి వెళ్లారు.కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకర్గంలోని మల్లం గ్రామంలో దళిత సామాజిక వర్గానికి చెందినవారిపై ఉన్నత వర్గాలు వివక్ష చూపిస్తున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఉన్నతవర్గాలు చెందినవారు దళితులను సాంఘిక బహిష్కరణకు గురి చేశారు. వారికి టిఫిన్, టీ ఏమీ ఇవ్వకుండా వ్యాపారుల్ని కట్టడి చేశారు. ఆ సామాజిక వర్గానికి చెందిన వారికి కనీసం నిత్యావసరాలు కూడా ఇవ్వడంలేదు. ఒకరకంగా వారిని వెలివేసినట్టు చేశారు. దీంతో వారంతా స్థానిక ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. మల్లం గ్రామానికి అధికారులంతా విచారణ కోసం వెళ్లారు. సీఐ సమక్షంలో ఆర్డీవో విచారణ చేపట్టారు. వివక్షకు గురైన వారిని కలిశారు. వారు చెప్పిన అంశాలన్నీ విన్నారు. ఆధారాలు సేకరించారు. ఉన్నతవర్గాలు తమను సామాజిక బహిష్కరణకు గురి చేశాయని, వారిపై చర్యలు తీసుకోవాలని బాధితులు ఫిర్యాదు చేశారుఅసలు ఈ గొడవ ఎందుకు మొదలైందనే విషయాన్ని బాధితులు కొంతమంది సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. మల్లం గ్రామంలో ఇటీవల దళిత వర్గానికి చెందిన సురేష్ అనే యువకుడు ఉన్నత వర్గాలకు చెందిన వారి ఇంటికి విద్యుత్ రిపేర్ వర్క్ కోసం వెళ్లాడు. అక్కడ అతను రిపేర్ చేస్తూ కరెంట్ షాక్ తో చనిపోయాడు. చనిపోయిన సురేష్ కుటుంబానికి న్యాయం చేయాలని, నష్టపరిహారం అందించాలని వారి బంధువులు, స్థానికులు డిమాండ్ చేశారు. దీంతో ఉన్నత వర్గాల వారు తమపై కక్షగట్టారని కొంతమంది ఆరోపిస్తున్నారు. దళితులను గ్రామ బహిష్కరణకు గురి చేశారని అంటున్నారు. తమకు వస్తువులు విక్రయించకూడదంటూ ఊరి పెద్ద ఆదేశించారని, వ్యాపారులెవరూ తమకు ఏమీ అమ్మడం లేదని ఆరోపించారు. దీనికి సంబంధించి కొన్ని వీడియోలను బాధితులు సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.పల్లం గ్రామం పిఠాపురం నియోజకవర్గంలో ఉండటంతో ఈ ఘటన మరింత సంచలనంగా మారింది. సాక్షాత్తూ డిప్యూటీసీఎం పవన్ కల్యాణ్ నియోజకవర్గంలో దళితుల సాంఘిక బహిష్కరణ అంటూ వైసీపీ అనుకూల మీడియాలో వార్తలు వస్తున్నాయి. జరిగిన సంఘటనను హైలైట్ చేయడంతోపాటు, అది పవన్ కల్యాణ్ నియోజకవర్గం అనే విషయాన్ని ప్రస్తావిస్తూ వైసీపీ మీడియా కథనాలిస్తోంది. దీంతో ఈ వ్యవహారం సోషల్ మీడియాలో కూడా సంచలనంగా మారింది. అయితే జనసేన తరపున ఎక్కడా అధికారికంగా ఈ వ్యవహారంపై నాయకులెవరూ స్పందించలేదు.పవన్ కల్యాణ్ నియోజకవర్గం అంటూ వార్తలు రావడంతో వెంటనే అధికారులు కూడా అప్రమత్తం అయ్యారు. పల్లం గ్రామంలో పర్యటించారు. బాధితులకు భరోసా ఇచ్చారు. వెలి వేశారంటున్న వారి నుంచి వివరాలు సేకరించారు. సమగ్ర నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించబోతున్నారు. ఈ ఘటనపై డిప్యూటీసీఎం కార్యాలయం కూడా వివరణ కోరినట్టు తెలుస్తోంది.

# ఐపీఎల్‌లో రహానే అరుదైన రికార్డ్: టెస్ట్ ప్లేయర్ అనుకుంటే విధ్వంసకర ఆటగాళ్ల సరసన



**హైదరాబాద్ పెన్ పవర్:** కోల్‌కతా నైట్ రైడర్స్ కెప్టెన్ అజింక్య రహానే ఐపీఎల్ లో అరుదైన మైలురాయిని అందుకున్నాడు. ఐపీఎల్ చరిత్రలో 500 ఫోర్లు కొట్టిన అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. ఈడెన్ గార్డెన్స్ వేదికగా సోమవారం (ఏప్రిల్ 21) గుజరాత్ టైటాన్స్ తో జరిగిన మ్యాచ్ లో రహానే ఈ ఘనత అందుకున్నాడు. ఈ మ్యాచ్ ముందు వరకు 497 బౌండరీలు బాదిన ఈ కేకేఆర్ కెప్టెన్.. ఈ మ్యాచ్ లో ఇషాంత్ శర్మ బౌలింగ్ లో ఫోర్ 500 ఫోర్లను పూర్తి చేసుకున్నాడు. ఐపీఎల్ చరిత్రలో 500 ఫోర్లు కొట్టిన ఆరో బ్యాటర్ గా నిలిచాడు. రహానే కంటే ముందు ఈ లిస్ట్ లో శిఖర్ ధావన్, విరాట్ కోహ్లీ , డేవిడ్ వార్నర్, రోహిత్ శర్మ, సురేష్ రైనా ఉన్నారు. రహానే ఐపీఎల్ కెరీర్ లో ప్రస్తుతం 502 బౌండరీలు ఉన్నాయి. మరో ఐదు ఫోర్లు కొడితే సురేష్ రైనాను అధిగమించి టాప్ 5 లోకి చేరతాడు. ప్రస్తుతం 768 ఫోర్లతో శిఖర్ ధావన్ అగ్ర స్థానంలో ఉన్నాడు. ఈ మ్యాచ్ లో రహానే మొత్తం 5 ఫోర్లు, ఒక సిక్సర్ తో 36 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. రహానే ఒక్కడే పోరాడినా అతనికి సహకరించకపోయేవారు ఎవరూ లేకపోయేసరికి కోల్‌కతా ఈ మ్యాచ్ లో ఓడిపోయింది.

**ఐపీఎల్‌లో అత్యధిక ఫోర్లు**

768 - శిఖర్ ధావన్ (DC/Deccan/MI/PBKS/SRH) 221 ఇన్నింగ్స్‌లో

732 - విరాట్ కోహ్లీ (RCB) 252 ఇన్నింగ్స్‌లలో

663 - డేవిడ్ వార్నర్ (DC/SRH) 184 ఇన్నింగ్స్‌లలో

609 - రోహిత్ శర్మ (డెక్కన్/MI) 259 ఇన్నింగ్స్‌లలో

506 - సురేష్ రైనా (CSK/GL) 200 ఇన్నింగ్స్‌లలో

502 - అజింక్య రహానె (KKR/RPS/RR/CSK/MI/DC) 179 ఇన్నింగ్స్‌లలో

సోమవారం (ఏప్రిల్ 21) జరిగిన ఈ మ్యాచ్ లో కోల్‌కతా నైట్ రైడర్స్ పై గుజరాత్ టైటాన్స్ 39 పరుగుల భారీ తేడాతో విజయాన్ని అందుకుంది. మొదట బ్యాటింగ్ లో అదరగొట్టిన గిల్ సేన.. తర్వాత బౌలింగ్ లో సమిష్టిగా రాణించి ఈ సీజన్ లో ఆరో విక్టరీ కొట్టింది. టాస్ ఓడి మొదటి బ్యాటింగ్ చేసిన గుజరాత్.. నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 198 పరుగులు చేసింది. లక్ష్య ఛేదనలో కోల్‌కతా 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 159 పరుగులు మాత్రమే చేయగలిగింది.

# ఐపీఎల్ లో రాజస్థాన్ రాయల్స్ పై మ్యాచ్ ఫిక్సింగ్ ఆరోపణలు... ఆ జట్టు మేనేజ్ మెంట్ స్పందన!

- లక్నో మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ ఓటమిపై వివాదం
- ఫిక్సింగ్ ఆరోపణలు చేసిన రాజస్థాన్ క్రికెట్ అసోసియేషన్ అడ్‌హక్ కమిటీ కన్వీనర్ జయదీప్ బిహానీ
- ఆరోపణలు నిరాధారమని రాజస్థాన్ రాయల్స్ యాజమాన్యం ఖండన



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ లో ఫిక్సింగ్ ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. ఇటీవల లక్నో సూపర్ జెయింట్స్ రాజస్థాన్ రాయల్స్ మధ్య జరిగిన మ్యాచ్ లో రాజస్థాన్ ఓడిపోయింది. ఇక్కడే ఫిక్సింగ్ ఆరోపణలు మొదలయ్యాయి. గెలవాల్సిన మ్యాచ్ లో ఆర్ఆర్ ఎలా ఓడిపోయిందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అనూహ్య వివాదం రాజుకుంది. ఈ మ్యాచ్ ఫలితంపై రాజస్థాన్ క్రికెట్ అసోసియేషన్ తాత్కాలిక అడ్‌హక్ కమిటీ కన్వీనర్ జయదీప్ బిహానీ సంచలన ఆరోపణలు చేశారు. మ్యాచ్ ఫిక్సింగ్ జరిగిందని ఆయన చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపగా, రాజస్థాన్ రాయల్స్ యాజమాన్యం ఈ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించింది.జయదీప్ బిహానీ చేసిన ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని, జట్టు ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ఉన్నాయని రాజస్థాన్ రాయల్స్ యాజమాన్యం పేర్కొంది. బిహానీ వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణిస్తున్నామని, ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ రాజస్థాన్ ముఖ్యమంత్రి, రాష్ట్ర క్రీడా మంత్రి, క్రీడా కార్యదర్శికి అధికారికంగా ఫిర్యాదు చేసినట్లు తెలిపింది. రాజస్థాన్ రాయల్స్ సీనియర్ అధికారి దీప్ రాయ్ సైతం ఈ ఆరోపణలను తోసిపుచ్చారు. "బిహానీ చేసినవి కేవలం తప్పుడు, నిరాధారమైన ఆరోపణలు మాత్రమే" అని ఆయన కొట్టిపారేశారు."బిహానీ చేసిన అన్ని ఆరోపణలను మేం పూర్తిగా ఖండిస్తున్నాం. ఇటువంటి బహిరంగ ప్రకటనలు ప్రజలను తప్పుదారి పట్టించడమే కాకుండా, రాజస్థాన్ రాయల్స్, రాయల్ మల్టీ స్పోర్ట్ ప్రైవేట్ లిమిటెడ్, రాజస్థాన్ స్పోర్ట్స్ కౌన్సిల్, బీసీసీఐల కీర్తి ప్రతిష్ఠలకు, విశ్వసనీయతకు తీవ్ర నష్టం కలిగిస్తాయి. ఇది క్రికెట్ గౌరవాన్ని దెబ్బతీసే ప్రయత్నమే" అని ఆర్ఆర్ యాజమాన్యం ఆగ్రహం వ్యక్తం చేసింది.

# నేనలా చేయలేదు.. ఆ పుకారు వింటే ఇప్పటికీ నవ్వొస్తుంది: ధోనీ



**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ కెరీర్ లో ఎన్నో మధురమైన జ్ఞాపకాలు ఉన్నాయి. భారత జట్టుతో పాటు ఐపీఎల్ లో చెన్నై సూపర్ కింగ్స్ ను విజయవంతంగా నడిపిన కెప్టెన్. అంతర్జాతీయ క్రికెట్ లో వన్డే వరల్డ్ కప్, టీ20 వరల్డ్ కప్, ఛాంపియన్స్ ట్రోఫీ టైటిల్స్ ను అందించిన ఏకైక కెప్టెన్. ఐపీఎల్ లో చెన్నై సూపర్ కింగ్స్ కు 5 సార్లు టైటిల్స్ అందించాడు. తన క్రికెట్ కెరీర్ లో ఎన్ని హ్యాపీ మూమెంట్స్ ఉన్నా.. కొన్ని పుకార్లు కూడా ఉన్నాయి. తన గురించి విన్న పుకార్ల లో ఒకటి ధోనీ పంచుకున్నాడు. ఇటీవలే ఒక కార్యక్రమంలో పాల్గొన్న ధోనీ తాను ఇప్పటివరకు విన్న హాస్యాస్పదమైన పుకారు గురించి చెప్పాడు. " ఈ కార్యక్రమంలో భాగంగా యాంకర్ ధోనీని.. మీరు ఇప్పటివరకు విన్న ఒక అర్థం లేని పుకారు గురించి చెప్పాలని కోరింది. దీనికి ధోనీ స్పందిస్తూ చిరు నవ్వుతో ఇలా అన్నాడు .. " నేను రోజుకు ఐదు లీటర్ల పాలు తాగుతాననే పుకారు నాకు నవ్వు తెప్పించింది. నేను రోజంతా ఒక లీటరు పాలు తాగేవాడిని. కానీ నాలుగు లీటర్లు అంటే ఎవరికైనా కొంచెం ఎక్కువే".అని ధోని అన్నాడు. ధోనీ సమాధానం విని ఈ ఈవెంట్ యాంకర్ కూడా ఆశ్చర్యపోవాదం విశేషం. ప్రస్తుత ఐపీఎల్ సీజన్ లో ధోనీ చెన్నై సూపర్ కింగ్స్ జట్టుకు కెప్టెన్ చేస్తున్నాడు. ఐపీఎల్ లో చెన్నై ఇప్పటివరకు ఆడిన 8 మ్యాచ్ ల్లో రెండు మాత్రమే గెలిచింది. మిగిలిన 6 మ్యాచ్ ల్లో తప్పకుండా గెలిస్తేనే ప్లే ఆఫ్స్ కు చేరతాయి. ఒక్క మ్యాచ్ ఓడిపోయినా ఇంటి దారి పట్టడం ఖాయం. నెట్ రన్ రేట్ కూడా మైనస్ ల్లో ఉండడం చెన్నైకు ఉంది. దీంతో తర్వాత ఆడబోయే మ్యాచ్ ల్లో భారీగా గెలవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ టోర్నీలో చెన్నై సూపర్ కింగ్స్ తమ తదుపరి మ్యాచ్ శుక్రవారం (ఏప్రిల్ 25) సన్ రైజర్స్ హైదరాబాద్ తో తలపడుతుంది. చెన్నై ఈ మ్యాచ్ లో ఓడితే టోర్నీ నుంచి నిష్క్రమిస్తుంది.

# హిట్ ఇచ్చినా డైరెక్టర్ ని నమ్మని నాగార్జున..?

నా సామిరంగ సినిమా తర్వాత కింగ్ నాగార్జున నెక్స్ట్ సినిమా అనౌన్స్ చేయలేదు. ధనుష్ తో కుబేర సినిమాలో ఇంపార్టెంట్ రోల్ చేస్తున్నా కూడా అది ఆయన సినిమా కిందకు వచ్చే ఛాన్స్ లేదు. మరోపక్క కోలీవుడ్ లో సూపర్ స్టార్ రజినీకాంత్ కూలీలో కూడా నటిస్తున్నాడు నాగార్జున. అంతా బాగుంది కానీ నాగార్జున నెక్స్ట్ సినిమా ఎప్పుడు అంటూ అక్కినేని ఫ్యాన్స్ ఎదురుచూస్తున్నారు. నా సామిరంగ సినిమాతో సక్సెస్ అందుకున్న నాగార్జున ఇక మీదట ప్రతి సంక్రాంతికి ఒక సినిమాతో వస్తాయని ఫ్యాన్స్ కి చెప్పాడు. కానీ ఈ సంక్రాంతి మిస్ అయ్యాడు. నెక్స్ట్ సంక్రాంతికి అయినా వస్తాడా లేడా అన్న క్లారిటీ లేదు. నా సామిరంగ తర్వాత ఇంతవరకు ఏ కథను ఓకే చేయలేదు. ఐతే ఆ సినిమా డైరెక్టర్ విజయ్ బిన్ని మరో కథ చెప్పినా నాగ్ సార్ సాటిస్ఫై అవ్వలేదని టాక్. విజయ్ బిన్ని నా సామిరంగ కన్నా ముందే తన సొంత కథతోనే నాగార్జునతో సినిమా చేయాలని అనుకున్నారు. కానీ నా సామిరంగ కథ చేతిలో పెట్టి ఇది తీసి చూపించమని చెప్పగానే అతను అదే చేశాడు. ఐతే హిట్ ఇచ్చాడు కాబట్టి ఈసారి అతని సొంత కథతో సినిమా చేయాలని అనుకోగా అది మాత్రం ఇప్పుడు అప్పుడు అంటూ లేట్ చేస్తున్నారట.త్వరలోనే 100 సినిమా చేయబోతున్న నాగార్జున తన సినిమాల కథల విషయంలో చాలా జాగ్రత్త వహిస్తున్నారు. విజయ్ బిన్ని కథ నచ్చినా స్క్రీన్ ప్లే విషయంలో కాస్త అసంతృప్తిగా ఉన్నట్టు తెలుస్తుంది. మరి నాగార్జున నెక్స్ట్ సినిమా డైరెక్టర్ ఎవరు.. ఆ సినిమా ఎలాంటి కథతో వస్తుందో తెలియాల్సి ఉంది.నాగార్జున నెక్స్ట్ సినిమా కోసం అక్కినేని ఫ్యాన్స్ అంతా కూడా ఈగర్ గా ఎదురుచూస్తున్నారు. కథల విషయంలో నాగార్జున ఫోకస్ తో ఉన్నారని టాక్. మరి నెక్స్ట్ సినిమా భారీ టార్గెట్ పెట్టుకున్న మన కింగ్ ఎలాంటి కథను పిక్ చేసుకుంటారన్నది చూడాలి. హిట్ ఇచ్చినా కూడా డైరెక్టర్ ని నమ్మకపోతే ఎలా అనుకుంటూ కొందరు అనుకుంటుంటే మరికొందరు మాత్రం ఈసారి నాగార్జున ప్లాన్ ఒక రేంజ్ లో ఉందని చెప్పుకుంటున్నారు. ఏది ఏమైనా ఈ వెయిటింగ్ ఫ్యాన్స్ కి డబుల్ అంచనాలు ఏర్పరచేలా చేస్తున్నా కూడా మరీ లేట్ అయితే కష్టమే అని అనుకుంటున్న వారు ఉన్నారు.



## అలియా భట్ నెయిల్స్ ప్లేఫుల్ ఫ్యాషన్ గేమ్



## చిత్రాంగద సింగ్ గులాబీ రంగులో చూడముచ్చట గా ఉంది



On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com